




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 114, పేజీలు - 08

సోమవారం, సెప్టెంబర్ 29, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD









## న్యూయార్క్‌ను మరిపించే

# నగరం నిర్మిస్తా

### ఫ్యూచర్ సిటీకి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన

- ఫార్చ్యూన్ 500 కంపెనీలు రప్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా
- రంగారెడ్డి జిల్లాలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయానికి శంకుస్థాపన
- ప్రాజెక్ట్‌పై వస్తున్న విమర్శలను ఖండించిన ముఖ్యమంత్రి
- ఇది తన వ్యక్తిగత ఆస్తుల కోసం కాదని, భవిష్యత్ తరాల కోసమేనని స్పష్టీకరణ

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని, రాష్ట్రాభివృద్ధికి తీసుకున్న ఈ విప్లవాత్మక చర్యలపై విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్ పేటలో ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫీసుకు రేవంత్ శంకుస్థాపన చేసి మాట్లాడారు మంచి సంకల్పంతో ప్రారంభించిన ఈ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుకు స్వయంగా వరుణదేవుడు కూడా సహకరించాడు అని వ్యాఖ్యానించారు. కార్యక్రమానికి మంచి వాతావరణం, సహకరించిన సహజ పరిస్థితులను ఆయన అభినందించారు.

**ఆరోపణలకు కౌంటర్**

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కొందరు వ్యక్తులు చేస్తున్న అవాస్తవ ఆరోపణలపై ఘాటుగా స్పందించారు. ఇక్కడ నాకేదో భూములు ఉన్నాయని, అందుకే

2లో..



## నిస్వార్థ సేవ, క్రమశిక్షణ ఆరెస్సెస్

# నిజమైన బలాలు

### - మన్కీ బాత్లో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ** (ప్రశ్న న్యూస్) నిస్వార్థ సేవకు స్ఫూర్తి, క్రమశిక్షణకు మారుపేరు ఆరెస్సెస్ అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆరెస్సెస్ 100 ఏళ్లు పూర్తి చేసుకోబోతున్న నేపథ్యంలో ఆ సంఘం సేవలను ప్రధాని కొనియాడారు. నిస్వార్థ సేవ, క్రమశిక్షణ సంఘ్ నిజమైన బలాలు అన్నారు. 'దేశం ముందు' అనే నినాదంతో సంఘ్ పనిచేస్తుందని, ప్రతి చర్యలోనూ అది కనిస్తుంన్నారు. అలా నేటివరకు లెక్కలేనన్ని స్వచ్ఛంద సేవలు చేసిందన్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రధాని మోదీ తన 125వ మన్ కీ బాత్ రేడియో ప్రసారంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా స్వదేశీ వస్తువుల వినియోగం గురించి మరోసారి మాట్లాడారు. ప్రజలు ఖాదీ వస్తువును కొనుగోలు చేయాలని కోరారు.

**సైద్ధాంతిక బానిసత్వం నుంచి విముక్తి కోసం స్థాపన**

ఆర్ఎస్ఎస్‌ను ప్రశంసిస్తూ 'కొద్ది రోజుల్లో మనం విజయదశమిని జరుపుకోబోతున్నాం. ఈసారి ఈ వేడుకలు మరింత ప్రత్యేకమైనవి. ఈ రోజున, ఆర్ఎస్ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ శతాబ్దపు ప్రయాణం అద్భుతమైనది మాత్రమే కాదు. స్ఫూర్తిదాయకం. వందేండ్ల క్రితం ఆరెస్సెస్ స్థాపించిన సమయంలో మన దేశం బానిసత్వ సంకెళ్లలో బాధకు గురవుతోంది. శతాబ్దాల నాటి ఆ బానిసత్వం మన ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవంపై భారీ గాయాన్ని చేసింది. అందుకే దేశ స్వాతంత్ర్యంతో పాటు, దేశాన్ని సైద్ధాంతిక బానిసత్వం నుంచి విముక్తి చేసేందుకు 1925లో కేబీ హెడ్గేవార్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ను స్థాపించారని మోదీ అన్నారు.

**ముందుండేది ఆరెస్సెస్ సేవకులే..**

'హెడ్గేవార్ తర్వాత గురు గోల్వాల్కర్ దేశానికి సేవ చేయడానికి ఈ మహా యజ్ఞాన్ని ముందుకు తీసుకెళ్లారు. నిస్వార్థ సేవాస్ఫూర్తి క్రమశిక్షణ ఇవే సంఘ్ నిజమైన బలాలు. వందేళ్లుగా ఆరెస్సెస్ విరామం, విశ్రాంతి లేకుండా దేశ సేవలో అవిశ్రాంతంగా నిమగ్నమై ఉంది' అని మోదీ కొనియాడారు అన్నారు. 'ఏదైనా ప్రకృతి వైపరీత్యం సంభవించినప్పుడు ముందుగా అక్కడికి చేరుకునేది ఆర్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవకులే. లెక్కలేనన్ని ఆర్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవకుల ప్రతి చర్యలోనూ, 'దేశం ముందు' అనే స్ఫూర్తి ఎల్లప్పుడూ అత్యున్నతంగా ఉంటుంది' అని అన్నారు.

**ఉమెన్ నేవీ ఆఫీసర్లతో మోదీ సంభాషణ**

ఈ సందర్భంగా ఉమెన్ నేవీ ఆఫీసర్ లెఫ్టినెంట్ కమాండర్

2లో..

## జూబ్లీహిల్స్ ఎలక్షన్‌కు

2లో..

# రంగం సిద్ధం

### - ఈసీ కీలక అప్ డేట్




## ఎస్టీ సంస్కరణలను

# ప్రజలకు వివరించాలి

### - కేడర్‌తో లీడర్ టెలీకాన్ఫరెన్స్



- జీఎస్టీ ఉత్సవ్ నిర్వహణపై పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్యకర్తలకు సూచనలు
- రాష్ట్రానికి ఆదాయం తగ్గినా ప్రజలకు పెద్ద ఎత్తున లబ్ధి చేకూరుతుందని వ్యాఖ్య
- కేంద్రం తీసుకొచ్చిన ఈ మార్పులను ఈ మార్పులను ప్రజలకు వివరించాలని క్యాడర్కు దిశానిర్దేశం

అమరావతి (ప్రశ్న న్యూస్) వస్తు సేవల పన్ను (జీఎస్టీ) లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు దేశం చరిత్రలోనే నూతన అధ్యాయమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సంస్కరణలతో రాష్ట్రానికి వచ్చే ఆదాయం తగ్గుతుందని, అయితే, రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు పెద్ద ఎత్తున లబ్ధి జరుగుతుందని చెప్పారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఉదయం తెలుగుదేశం పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గ్రామస్థాయి కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ క్యాడర్ కు చంద్రబాబు పలు కీలక సూచనలు చేశారు.

2లో..

## జూబ్లీహిల్స్‌లో

# బీఆర్ఎస్ నయా ప్లాన్

### - ఇంటింటికీ 'కాంగ్రెస్ బాకీ కార్డులు' పంపిణీ

- ఇంటింటికీ తిరిగి కార్డులు పంచుతున్న కేటీఆర్
- నెరవేర్చని హామీలతో ప్రజలకు కాంగ్రెస్ బాకీపడిందని విమర్శ
- ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపు
- ప్రభుత్వ పాలనపై తీవ్ర స్థాయిలో ఫైర్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారంలో అధికార కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా బీఆర్ఎస్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పంపిణీ చేసిన 'గ్యారెంటీ కార్డుల'కు బదులుగా ఇప్పుడు బీఆర్ఎస్ 'కాంగ్రెస్ బాకీ కార్డులు'

2లో..



# పవన్ కళ్యాణ్ నివాసానికి చంద్రబాబు

- హైదరాబాద్‌లోని నివాసంలో పరామర్శించిన సీఎం చంద్రబాబు
- విజయవంతమైన మెగా డీఎస్సీపై సీఎంకు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు
- అక్టోబర్ 4న ఆటో డ్రైవర్లకు ఆర్థిక భరోసా కార్యక్రమంపై ఇరువురి మధ్య చర్చ
- ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటన, జీఎస్టీ రోడ్ షోపైనా మంతనాలు
- ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పవన్‌కు ముఖ్యమంత్రి సూచన

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు పరామర్శించారు. వైరల్ జ్వరంతో బాధపడుతున్న పవన్‌ను ఆయన హైదరాబాద్‌లోని నివాసంలో ఆదివారం మధ్యాహ్నం కలుసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జ్వరం తీవ్రత తగ్గిందని, అయితే ఎడతెరిపి లేకుండా వస్తున్న దగ్గు ఇబ్బంది పెడుతోందని పవన్ ముఖ్యమంత్రికి వివరించారు. వైద్య పరీక్షల అనంతరం, దీర్ఘకాలిక బ్రాంకైటిస్ కారణంగానే దగ్గు, గొంతు నొప్పి వస్తున్నట్లు వైద్యులు నిర్ధారించారని తెలిపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు పవన్ త్వరగా

2లో..



## తిరుమల కొండపై

# వైభవంగా గరుడ సేవ

### - రెండు లక్షల మంది పైగా హాజరు



**తిరుమల (ప్రశ్న న్యూస్)** కలియుగ వైకుంఠం తిరుమల క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన ఆదివారం సాయంత్రం జరిగిన గరుడ వాహన సేవ అంగరంగ వైభవంగా, కన్నుల పండువగా సాగింది. తన ప్రియ వాహనమైన గరుత్మంతునిపై తిరుమాడ వీధుల్లో విహరిస్తున్న శ్రీ మలయప్ప స్వామి వారిని దర్శించుకునేందుకు లక్షలాదిగా భక్తులు తరలిరావడంతో తిరుమల గిరులు గోవింద నామస్మరణతో మార్మోగిపోయాయి. సాయంత్రం 6:30 గంటలకు

2లో..

# మూసీ పునరుజ్జీవనం మా లక్ష్యం

### - బతుకమ్మ కుంట చెరువు ప్రారంభోత్సవంలో రేవంత్ రెడ్డి

- బతుకమ్మ కుంట చెరువు ప్రజలకు అంకితం చేసిన సీఎం
- మూసీ నది పునరుజ్జీవం కోసం నగర వాసులందరు సహకరించాలి
- అంబర్‌పేట పేదలకు పునరావాసం
- మాయ మాటలు నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఆడబిడ్డలను మన సంతోషంలో భాగస్వాములను చేసినప్పుడే బతుకమ్మ పండుగకు నిండుదనం వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అంబర్‌పేటలో పునరుద్ధరించిన బతుకమ్మ కుంట ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీఎం చెరువులో బతుకమ్మలు వదిలి, గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎంపీ వి.హనుమంతరావు తన జీవితాశయంగా బతుకమ్మ కుంట కోసం పోరాడారని కొనియాడారు. హైడ్రా ఏర్పాటు చేసినప్పుడు

2లో..



## తెలంగాణలో గ్రూప్-2 ఫలితాలు విడుదల

### - 783 ప్రభుత్వ ఉద్యోగాలకు అభ్యర్థుల ఎంపిక పూర్తి

2లో..




# ఎవరైనా భద్రతకు భంగం కలిగిస్తే ఊరుకునేది లేదు

### - కొత్త పోలీస్ బాస్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలు కాపాడడంలో ఎవరైనా భద్రతకు భంగం కలిగిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని కొత్తగా నియమితులైన పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన నగరంలోని రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 'ప్రజల రక్షణే మా ప్రధాన లక్ష్యం. చట్టం ఎవరికైనా ఒకటే. రౌడీషీటర్లు శాంతి భద్రతల్ని భగ్నం చేయాలని చూస్తే వారిపై పీడీ యాక్ట్‌లు అమలు చేస్తాం. అవసరమైతే ప్రివెంటివ్ డిటెన్షన్ కూడా వదిలిపెట్టము' అన్నారు. ఈ సందర్భంగా ఆయన సైబర్ నేరాలు, ఆర్థిక నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాల పట్ల ముందస్తు అవగాహన కల్పించి ప్రజలకు భద్రత కల్పించడమే తమ ధ్యేయమన్నారు. ఇక ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 23 మంది ఐపీఎస్ అధికారుల బదిలీలను ప్రకటించింది. ఇందులో భాగంగానే వీసీ సజ్జనార్‌ను హైదరాబాద్ పోలీస్

2లో..



# న్యూయార్క్‌ను మరిపించే నగరం నిర్మిస్తా

ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నామని చెబుతున్నారు. కానీ ఇది నా కోసమో, నా కుటుంబం కోసమో కాదు. ఇది భవిష్యత్ తరాల భవిష్యత్తు కోసం అని స్పష్టం చేశారు.

### గతంలో సైబరాబాద్, సిలికాన్ వ్యాలీ.. ఇప్పుడు ఫ్యూచర్ సిటీ

“ఆనాడు కులీ కుతుబ్ షా హైదరాబాద్ నగరానికి అంకురార్పణ చేశాడు. నిజాం కాలంలో సికింద్రాబాద్ అభివృద్ధి జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్, సిలికాన్ వ్యాలీ ఎదిగాయి. ఇప్పుడు మన వంతు వచ్చింది అని గుర్తుచేశారు. గతం నుంచి చాలా నేర్చుకోవాల్సి ఉందని, భవిష్యత్ తరాల కోసం భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం అత్యవసరమని అన్నారు.

### దక్షిణాదిన పోర్ట్ లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ

ప్రపంచ నగరాల్లో చర్చకు వచ్చే స్థాయిలో భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఒక గొప్ప నగరంగా రూపుదిద్దుకోవాల్సిన అన్ని అర్హతలూ ఈ నగరానికి ఉన్నాయని వ్యాఖ్యానించారు. తెలంగాణ దక్షిణ భారతదేశంలో పోర్ట్ లేని ఏకైక రాష్ట్రం అని చెబుతూ, మచిలీపట్నం వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేలో డ్రై పోర్ట్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అమరావతి వరకు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకూ కేంద్రం అంగీకరించిందని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో అండర్‌గ్రౌండ్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని తెలిపారు.

### ఫార్చ్యూన్ 500 కంపెనీలే లక్ష్యం

రాబోయే పదేళ్లలో ప్రపంచంలో టాప్‌లో ఉన్న ఫార్చ్యూన్ 500 కంపెనీలు ఫ్యూచర్ సిటీలో స్థానం కలిగి ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని చెప్పారు. ప్రభుత్వం ఈ నగర అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తోందని వివరించారు.

### ప్రజల భాగస్వామ్యం, సమస్యల పరిష్కారం

“ఇందుకు మీ అందరి సహకారం అవసరం,” అని ప్రజలకు పిలుపునిచ్చిన సీఎం, చిన్నచిన్న సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ప్రజలు రాజకీయాల ఉచ్చుల్లో పడకుండా, నేరుగా ప్రభుత్వంతో మాట్లాడి సమస్యలు పరిష్కరించుకోవాలని అన్నారు. నేను స్వయంగా కూర్చొని మీ సమస్యలు పరిష్కరిస్తాను. న్యాయం అందించడమే మా లక్ష్యం అని హామీ ఇచ్చారు. అధికారులను తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్నట్టు తెలిపారు.

### ఫ్యూచర్ సిటీ కేంద్రంగా ప్రభుత్వ కార్యకలాపాలు

2025 డిసెంబర్ నాటికి ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ భవనం, స్కిల్ యూనివర్సిటీ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. “అప్పుడు నెలకు మూడుసార్లు ఇక్కడికే వచ్చి, ఇక్కడి నుంచి అధికార కార్యకలాపాలు నడిపిస్తాను,” అని వెల్లడించారు. ప్రపంచంలోని ఎవరైనా ఇక్కడ పెట్టుబడి పెట్టాలనుకున్నా, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలోనే కూర్చొని మాట్లాడతా అని స్పష్టం చేశారు. ప్రపంచాన్ని ఇక్కడికే రప్పిస్తా అన్న ఆయన ధైర్యంగా ప్రజలకు భరోసా ఇచ్చారు.

### సింగరేణికి స్థలం కేటాయింపు

సింగరేణి కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి పది ఎకరాలు కేటాయించాలన్న సూచనను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబుకు ఇచ్చినట్లు తెలిపారు. 2026 డిసెంబర్ లోగా ఆ కార్యాలయ నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు.

# నిస్వార్థ సేవ, క్రమశిక్షణ ఆరెస్సెస్ నిజమైన బలాలు

దిల్నా, లెఫ్టినెంట్ కమాండర్ రూపతో ప్రధాని ఫోన్లో సంభాషించారు. సముద్ర గర్భంలో వారు చూపుతున్న తెగువను ప్రధాని ప్రశంసించారు. భారత పుత్రికలు కఠినమైన పరిస్థితులను సైతం సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నారని కొనియాడారు.

### ఛఠ్ను యునెస్కో వారసత్వ జాబితాలో చేర్చేందుకు కృషి

మన పండుగలు మన సంస్కృతిని సజీవంగా ఉంచుతాయని మోదీ అన్నారు. ఛాఠ్ పూజ గురించి ప్రస్తావించారు. ‘ఒకప్పుడు ఛఠ్ పూజ స్థానికంగా మాత్రమే ప్రసిద్ధి. ఇప్పుడు ప్రపంచ పండుగగా మారుతోంది. ఛఠ్ మహాపర్వాన్ని యునెస్కో అవ్యక్త సాంస్కృతిక వారసత్వ జాబితాలో చేర్చడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రపంచ పండుగగా గుర్తించినప్పుడు ప్రపంచంలోని వివిధ మూలల్లోని ప్రజలు ఈ పండుగ యొక్క గొప్పతనాన్ని అనుభవించగలుగుతారు’ అని అన్నారు. ప్రభుత్వ ప్రయత్నాలతో కోల్‌కతా దుర్గా పూజను యునెస్కో జాబితాలో చేర్చారని ఆయన గుర్తుచేశారు.

### ఖాదీ వస్తువులే కొనుగోలు చేయండి

అక్టోబర్ 2 గాంధీ జయంతి అని గుర్తుచేసుకుంటూ దురదృష్టవశాత్తు స్వాతంత్ర్యం తర్వాత దేశంలో ఖాదీ పట్ల ఆకర్షణ తగ్గిందని, కానీ గత 11 సంవత్సరాలుగా ఖాదీ పట్ల ఆకర్షణ గణనీయంగా పెరిగిందన్నారు. అమ్మకాలు క్రమంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. “అక్టోబర్ 2న ఖాదీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని నేను మిమ్మల్ని కోరుతున్నాను. గర్వంగా చెప్పండి, ఇది స్వదేశీ అని” అని ఆయన అన్నారు.

# ఎస్టీ సంస్కరణలను ప్రజలకు వివరించాలి

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న ‘జీఎస్టీ ఉత్సవ్’ కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. జీఎస్టీ సంస్కరణలతో ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ మార్పులను ప్రజలకు వివరించి చెప్పాలని పేర్కొన్నారు. కనీసం రాష్ట్రవ్యాప్తంగా 60 వేల సమావేశాలు పెట్టి జీఎస్టీ సంస్కరణలతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కూటమిలోని పార్టీలు ఉమ్మడిగా జీఎస్టీ సంస్కరణల ఉత్సవ్ ప్రచారాన్ని నిర్వహించాలని చెప్పారు. ప్రధాని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ అసెంబ్లీలో తీర్మానం కూడా చేశామని ఆయన గుర్తుచేశారు.జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు రూ. 8 వేల కోట్ల మేర లబ్ధి జరగుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. పారిశ్రామిక, ఆటో మొబైల్, ఫార్మా, వంటి కంపెనీలకు మేలు జరుగుతుందన్నారు. టూ వీలర్, ఏసీలు, కార్లు, వంటి ఇంటి వస్తువుల ధరలు తగ్గుతాయని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గాయని చెప్పారు. రోగులు వాడే మందులపై జీఎస్టీ లేదన్నారు. రాష్ట్రానికి వచ్చే ఆదాయం తగ్గినా సంస్కరణల వల్ల ప్రజలు ఆర్థికంగా బలోపేతం అవుతారని వివరించారు. సుపరిపాలన కార్యక్రమం ద్వారా ప్రజలకు ఏం చేశామో వివరించాం.. ఇప్పుడు కూడా అదే తరహాలో జీఎస్టీ ఉత్సవ్ కార్యక్రమాన్ని చేపట్టాలని చంద్రబాబు సూచించారు. కార్యకర్తల భాగస్వామ్యంతోనే యోగాడే సక్సెస్ అయిందని, అలాగే జీఎస్టీ ఉత్సవ్ ను కూడా సక్సెస్ చేయాలని పార్టీ కేడర్ కు చెప్పారు. కార్యకర్తలైనా, నాయకులైనా ఎల్లప్పుడూ ప్రజలకు చేరువగా ఉండాలని, మంచి చెడులను ప్రజలకు వివరించాలని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలోనే ప్రజల వద్దకు వెళ్తానంటే జనం హర్షించరని హెచ్చరించారు.

### వైసీపీ ప్రభుత్వంపై విసుర్లు..

గత ప్రభుత్వం విద్యుత్ శాఖను సంక్షోభంలోకి నెట్టేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం అసమర్థ విధానాల వల్ల ప్రజలపై విద్యుత్ ఛార్జీల రూపంలో భారం పడిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక 15 నెలల కాలంలోనే విద్యుత్ రంగాన్ని గాడిన పెట్టామని, అనేక సమస్యలను పరిష్కరించామని ఆయన చెప్పారు. ప్రస్తుతం తక్కువ ధరకు విద్యుత్ కొనుగోళ్లు చేపట్టామని వివరించారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా విద్యుత్ కొనుగోళ్లల్లో సుమారు రూ.1000 కోట్లు ఆదా చేశామని వెల్లడించారు. ఆ మేరకు రానున్న కాలంలో ప్రజలపై రూ.1000 కోట్ల భారాన్ని తగ్గిస్తున్నట్లు తెలిపారు. సూపర్ సిక్స్ సహా అనేక మేనిఫెస్టో హామీలను నెరవేర్చామని, ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను కార్యకర్తలు తీసుకోవాలని చంద్రబాబు ఈ సందర్భంగా పార్టీ క్యాడర్ కు సూచించారు.

# తెలంగాణలో గ్రూప్-2 ఫలితాలు విడుదల

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో గ్రూప్-2 ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది అభ్యర్థుల నిరీక్షణకు తెరపడింది. 2022 నోటిఫికేషన్‌కు సంబంధించిన 783 గ్రూప్-2 పోస్టుల తుది ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఆదివారం ప్రకటించింది. ఇందులో ఒక పోస్టు భర్తీ కాలేదు. టీజీపీఎస్సీ తాజా ప్రకటనతో ఎంపికైన అభ్యర్థుల కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొంది. 2024 డిసెంబర్ 15, 16 తేదీల్లో జరిగిన రాత పరీక్షలకు సుమారు 2.5 లక్షల మందికి పైగా హాజరయ్యారు. ఈ ఏడాది మార్చి 11న జనరల్ ర్యాంకింగ్ జాబితాను విడుదల చేసిన కమిషన్, ఆ తర్వాత ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షలు పూర్తి చేసింది. అభ్యర్థులు ఇచ్చిన ఆప్షన్లు, మెరిట్ ర్యాంకులు, రిజర్వేషన్ల ఆధారంగా తుది మెరిట్ జాబితాను రూపొందించింది. ఈ పరీక్షల్లో 600 మార్కులకు గాను అత్యధికంగా 447.08 మార్కులు నమోదైనట్లు కమిషన్ వెల్లడించింది.

ఈ నోటిఫికేషన్ ద్వారా అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్, సబ్-రిజిస్ట్రార్ గ్రేడ్-2, మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-3, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వంటి కీలక పోస్టులను భర్తీ చేయనున్నారు. ఎంపికైన వారికి దసరా పండుగకు ముందే నియామక పత్రాలు అందజేయాలని కమిషన్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఫలితాల విడుదలపై టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడుతూ, పరీక్షలు నిర్వహించిన 10 నెలల వ్యవధిలోనే తుది ఫలితాలు ఇచ్చామని, గ్రూప్-1 వివాదం లేకపోయి ఉంటే ఫలితాలు మరింత తొందరగా వచ్చేవని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా, కట్-ఆఫ్ మార్కుల వివరాలు టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ లో అందుబాటులో ఉన్నాయని, అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్‌తో ఫలితాలను చూసుకోవచ్చని కమిషన్ సూచించింది.

# జూబ్లీహిల్స్ ఎలక్షన్‌కు రంగం సిద్ధం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జూబ్లీహిల్స్ ఉపఎన్నిక మరికొన్ని రోజుల్లో జరగనుంది. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని రాష్ట్రంలోని పార్టీలు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయి. ఈ ఎన్నికల్లో అభ్యర్థులను పోటీలో నిలబెట్టేందుకు ఇప్పటికే రాజకీయ పార్టీలు తీవ్రంగా కసరత్తు చేస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే అభ్యర్థిని ప్రకటించాయి. ఆ పార్టీ నుంచి అభ్యర్థిగా మాగంటి సునీత గోపీనాథ్ పేరును బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇటీవల ప్రకటించారు. గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ పార్టీ నుంచి మాగంటి గోపీనాథ్ విజయం సాధించిన విషయం తెలిసిందే. మరోవైపు అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు బీజేపీ తమతమ అభ్యర్థులను బరిలో నిలిపేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో గెలవబోతున్నామని ఇటీవల టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఉప ఎన్నికల్లో గెలిచేది తామేనన్నారు. నియోజకవర్గంలో సర్వేలు చేస్తున్నామని గెలిచే వారికే టికెట్ ఇస్తామన్నారు. సామాజిక వర్గం కాదని గెలిచే వారికే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇక ఉప ఎన్నిక కోసం ఏ క్షణంలోనైనా నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదల అయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో అన్ని పార్టీలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి.అయితే తాజాగా జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉప ఎన్నికను పర్యవేక్షించడానికి కేంద్ర పరిశీలకులను నియమించింది కేంద్ర ఎన్నికల సంఘం. ఈ మేరకు ఆదివారం దీనికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించింది. అలాగే బిహార్ లో అసెంబ్లీ ఎన్నికలతో పాటు దేశవ్యాప్తంగా ఎనిమిది రాష్ట్రాల్లో ఉపఎన్నికల కోసం మొత్తం 470 మంది సీనియర్ అధికారులను నియమించినట్లు కమిషన్ తాజాగా ప్రకటన చేసింది. వీరిలో 320 మంది ఐఏఎస్, 60 మంది ఐపీఎస్, 90 మంది ఐఆర్ఎస్/ఐఆర్ఏఎస్/ఐసీఏఎస్ అధికారులు ఉన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు తెలంగాణ (జూబ్లీహిల్స్), జమ్మూ కాశ్మీర్ (బుద్గామ్, హైరోటా), రాజస్థాన్ (అంట), మిజోరం (దంపా), ఒడిశా (నువాపాడ), ఝార?ండ్ (ఘట్సిలా), పంజాబ్ (టార్న్ తరణ్) అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరగనున్న ఉప ఎన్నికల కోసం పరిశీలకులను నియమించినట్లు వెల్లడించింది.

# జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ నయా ప్లాన్

పేరుతో ప్రజల్లోకి వెళుతోంది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం స్వయంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, ఇంటింటికి తిరిగి ఈ కార్డులను పంపిణీ చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట, సమతా కాలనీలలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఇతర నేతలతో కలిసి కేటీఆర్ విస్తృతంగా పర్యటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మోసపూరిత హామీలను గుర్తుచేసేందుకే ఈ ప్రచారం చేపట్టామని కేటీఆర్ తెలిపారు. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన ప్రజలను కోరారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ వంద రోజుల్లో నెరవేరుస్తామన్న హామీలను 700 రోజులు గడిచినా కాంగ్రెస్ పట్టించుకోలేదని తీవ్రంగా విమర్శించారు. “మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామన్న పథకం కింద ప్రతి మహిళకు ప్రభుత్వం రూ. 55,000 బాకీ పడింది. అలాగే, వృద్ధులకు రూ. 4,000 పింఛను పథకం కింద ఒక్కొక్కరికి రూ. 44,000 అప్పు ఉంది. ఈ అప్పులన్నింటినీ గుర్తు చేయడానికే ఈ బాకీ కార్డుల ఉద్యమం” అని వివరించారు. పర్యటనలో భాగంగా స్థానికులు తమ సమస్యలను కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పారిశుద్ధ్యం లోపించిందని, చెత్త పేరుకుపోతోందని, మురుగునీరు నిలిచిపోతోందని, కరెంట్ కోతల వల్ల ఇన్వర్టర్లు కొనుక్కోవాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేసినట్లు పేర్కొన్నాయి. వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కేటీఆర్, కాంగ్రెస్ పాలన తీరుపై విరుచుకుపడ్డారు. “ప్రస్తుత నగరం వరదల్లో మునిగిపోతుంటే, ప్రజలు దోమలతో బాధపడుతుంటే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ‘ఫ్యూచర్ సిటీ’ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు” అని ఆయన ఎద్దేవా చేశారు. నిధుల కొరతపై మహబూబ్‌నగర్, ఎల్లారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలే స్వయంగా ఆందోళన వ్యక్తం చేయడమే వారి పాలనకు నిదర్శనమని అన్నారు. దివంగత మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అర్ధాంగి సునీతను ఆశీర్వదించి గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు.

# పవన్ కళ్యాణ్ నివాసానికి చంద్రబాబు

సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సమావేశంలో కేవలం ఆరోగ్య విషయాలే కాకుండా, రాష్ట్ర పరిపాలనకు సంబంధించిన పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. ఇటీవల విజయవంతంగా నిర్వహించిన మెగా డీఎస్సీ ద్వారా ఒకేసారి 15,941 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించడంపై పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ నియామక పత్రాలు అందించే కార్యక్రమం ద్వారా యువతలో గొప్ప మనోధైర్యాన్ని, స్ఫూర్తిని నింపారని అన్నారు. అనంతరం, అక్టోబర్ 4న విజయవాడలో నిర్వహించనున్న ‘ఆటో డ్రైవర్ల సేవలో’ కార్యక్రమం గురించి చర్చించారు. ‘స్త్రీ శక్తి’ పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా అమలు చేస్తున్నామని, దీనివల్ల ఆటో డ్రైవర్లు నష్టపోకూడదనే ఉద్దేశంతో, వారికి రూ.15,000 ఆర్థిక భరోసా అందించే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చంద్రబాబు వివరించారు. ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయం కచ్చితంగా అందరి మన్ననలు పొందుతుందని పవన్ విశ్వాసం వ్యక్తం చేశారు. అదేవిధంగా, అక్టోబర్ 16న ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనను విజయవంతం చేయడంపై కూడా ఇరువురు నేతలు మాట్లాడుకున్నారు. జీఎస్టీ సంస్కరణలపై ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న రోడ్ షో ప్రణాళికల గురించి కూడా ఈ భేటీలో ప్రస్తావనకు వచ్చింది.

# తిరుమల కొండపై వైభవంగా గరుడ సేవ

ప్రారంభమైన ఈ అపురూప ఘట్టాన్ని వీక్షించిన భక్తులు భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. బ్రహ్మోత్సవాలలో గరుడ సేవకు అత్యంత ప్రాముఖ్యత ఉండటంతో, దేశం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తిరుమలకు చేరుకున్నారు. మాడ వీధుల్లోని గ్యాలరీలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. దాదాపు రెండు లక్షల మందికి పైగా భక్తులు గరుడ సేవను ప్రత్యక్షంగా వీక్షించినట్లు అంచనా. నందకం, రామ్‌బాగ్, లేపాక్షి కూడళ్లతో పాటు, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు సైతం భక్తులతో నిండిపోయాయి.

గరుత్మంతునిపై సర్వాలంకార భూషితుడై వస్తున్న తమ ఆరాధ్య దైవాన్ని చూసి భక్తులు ఆనంద భాష్పాలతో నీరాజనాలు పలికారు. గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారిపైకి కర్పూర హారతులను విసురుతూ తమ భక్తిని చాటుకున్నారు.ఈ గరుడ సేవ రోజున మాత్రమే స్వామివారికి అలంకరించే అపురూపమైన ఆభరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఏడాదికి ఒక్కసారి మాత్రమే మూలవిరాట్ నుంచి బయటకు తీసుకువచ్చే అత్యంత విలువైన లక్ష్మీహారం, మకరకంఠి వంటి ఆభరణాలను ఉత్సవమూర్తి అయిన మలయప్ప స్వామికి అలంకరించారు. ఈ దివ్యాభరణాల కాంతులతో శ్రీవారు మరింత శోభాయమానంగా దర్శనమిచ్చారు.

అంతకుముందు ఉదయం, శ్రీవారు జగన్మోహిని అవతారంలో శృంగార రసాధి దేవతగా భక్తులను కటాక్షించారు. పక్కనే శ్రీకృష్ణుడు అభయహస్తంతో భక్తులకు అభయమిచ్చారు. పురాణాల ప్రకారం, తన తల్లి వినతను దాస్యం నుంచి విడిపించేందుకు గరుత్మంతుడు దేవలోకం నుంచి అమృత భాండాన్ని తీసుకొచ్చాడు. మాతృమూర్తిపై ఆయన చూపిన అచంచలమైన భక్తికి మెచ్చిన శ్రీమహావిష్ణువు, గరుత్మంతుడిని తన నిత్య వాహనంగా స్వీకరించారు. ఆ ఘట్టానికి ప్రతీకగా ఏటా బ్రహ్మోత్సవాల్లో గరుడ సేవను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ఠమైన భద్రత, వైద్య, ట్రాఫిక్ ఏర్పాట్లు చేశారు.

# ఎవరైనా భద్రతకు భంగం కలిగిస్తే ఊరుకునేది లేదు

కమిషనర్‌గా నియమించింది. ఆయనకు ముందుగా ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ బాధ్యతలు ఉండగా దాదాపు నాలుగు సంవత్సరాల విరామం తర్వాత ఆయనే మళ్లీ ఖాకీ డ్యూటీలోకి వచ్చారు. సజ్జనార్ స్థానంలో ఆర్టీసీ ఎండీగా సీనియర్ ఐపీఎస్ అధికారి నాగిరెడ్డి నియమితులయ్యారు. సజ్జనార్ అనుభవం ప్రగతిశీల విధానాలు హైదరాబాద్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు ఎంతో దోహదపడతాయని భావిస్తున్నారు. వీసీ సజ్జనార్, 1996 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. ఆయన పోలీస్ శాఖలో ఉన్నపుడు ఎన్నో ప్రముఖ కేసుల్లో సాహసోపేతంగా వ్యవహరించారు. వరంగల్ యాసిడ్ దాడి కేసు విషయంలో 2008 సంవత్సరంలో యాసిడ్ దాడికి గురైన యువతుల కేసు దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. అప్పటికి వారణగల్ డీఎస్పీగా పనిచేస్తున్న సజ్జనార్. బాధితులకు న్యాయం చేయడంలో ముఖ్యపాత్ర పోషించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఉన్న సమయంలో దిశా ఘటన దేశాన్ని కదిలించింది. మహిళల భద్రతపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తిన వేళ, సజ్జనార్ నేతృత్వంలో నిందితులను అదుపులోకి తీసుకుని.. దర్యాప్తు చేపట్టి, న్యాయపరమైన చర్యలు వేగంగా చేపట్టారు. దాదాపు ఇదే సమయంలో నిందితులు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా ప్రశంసలతోపాటు విమర్శలు కూడా వచ్చాయి. అయినా ప్రజల్లో ఆయన మీద నమ్మకాన్ని పెంచింది.

# మూసీ పునరుజ్జీవనం మా లక్ష్యం

కొంతమందికి దాని ఉద్దేశం అర్థం కాలేదని, మరికొందరు అర్థమైనా కబ్జాలను కాపాడుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వంపై చాలా విమర్శలు వచ్చాయని, ఒడిదుడుకులు వచ్చినప్పుడు సమయస్ఫూర్తితో పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లాలని ఆయన అన్నారు. కోవిడ్ తరువాత వాతావరణంలో విపరీతమైన మార్పులు వచ్చాయని, ఒకేసారి కుంభవృష్టి కురుస్తున్న పరిస్థితుల్లో, భవిష్యత్ లో ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.ఒకప్పుడు జీవధారగా ఉన్న మూసీ నది ఇప్పుడు మురికి కూపంగా మారిందని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులను విడిపించడం, నాలాలను విస్తరించడం, మూసీ పునరుజ్జీవనం చేయడం తమ ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నట్లు తెలిపారు. “రాజకీయాలకు అతీతంగా మూసీ పునరుజ్జీవానికి అందరూ కలిసి రావాలి” అని ఆయన పిలుపునిచ్చారు. కొంత మందికి పేదరికం ఎక్స్‌కర్షన్ లాంటిది కానీ, తమకు అలా కాదని, పేదరికం విలువ ఏమిటో తనకు తెలుసునని సీఎం అన్నారు. వర్షం వస్తే గంటలో మూసీ పరివాహక కాలనీలు జలమయం అవుతున్నాయని, ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణ, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు రూపొందించుకున్నట్లు తెలిపారు. అంబర్‌పేట మూసీ పరివాహక ప్రాంతాల పేదలకు పునరావాసం కల్పించేందుకు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. రాజకీయాలకు అతీతంగా అంబర్‌పేటను అభివృద్ధి చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. “మాయగాళ్లు మహానగరంలో చాలామంది ఉంటారు. వాళ్ల ముఠా నాయకుడు ఇంకొకరు ఉండొచ్చు. మాయమాటలు చెప్పి ప్రభుత్వ భూములను అగ్గువ సగ్గువకు అమ్మితే కొనకండి” అని పేదలకు ఆయన విజ్ఞప్తి చేశారు. తమది ప్రజా ప్రభుత్వం అని, ప్రజలెవరినీ కష్టపెట్టబోమని, తమ పేదలకు అండగా నిలబడుతుందని ఆయన భరోసా ఇచ్చారు.

# కేసీఆర్ సీఎం అయిన తర్వాతే మార్పు

**-మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్**



తొగుట : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి సంక్షేమం జరిగిందని మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్ పేర్కొన్నారు. దసరా పండుగ సందర్భంగా తొగుట మండలంలోని వెంకట్రావుపేటలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డితో కలిసి నిరుపేదలకు దోతీ, అంగీలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాకముందు కరువు, కాటకాలతో ఈ ప్రాంతం అల్లాడిపోయిందని.. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాతే సాగునీరు, కరెంటు, అభివృద్ధి, సంక్షేమంలో మార్పు రావడం జరిగిందన్నారు. సాధారణ ఎన్నికల్లో దుబ్బాక ఎమ్మెల్యేగా కొత్త ప్రభాకర్ రెడ్డి ఘన విజయం సాధించడం జరిగిందన్నారు. మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి మోసం చేయడం జరిగిందన్నారు.దసరా పండుగ సందర్భంగా పేదవారికి దోతి, అంగీలను పంచడం జరుగుతుందని ఆయన తెలిపారు. తనకు పదవులపై ఆశ లేదని, కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డబ్బికారి పెంటోజీ, బండారు స్వామిగౌడ్, పిట్ల వెంకటయ్య, గంగొళ్ల రాజు, ఈదుగల్ల పర్శరాములు, కంకణాల స్వామి, పులిగారి లక్ష్మణ్, తర్గం నర్సింహ్మారెడ్డి, జహంగీర్, రాంబాబు, నవీన్ తదితరులు ఉన్నారు.

# తిరుమలకు పోటెత్తిన భక్తులు..

## కొండపైకి ప్రైవేటు వాహనాలకు నో పర్మిషన్!



తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలను వీక్షించేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. ఆదివారం సాయంత్రం నిర్వహించనున్న గరుడ వాహనసేవను తిలకించేందుకు వచ్చిన భక్తులతో తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. మాఢవీధుల్లోని గ్యాలరీలు అన్నీ భక్తులతో కిక్కిరిసిపోతున్నాయి. ఈ నేపథ్యంలో టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది.అలిపిరి నుంచి తిరుమలకు వచ్చే రెండో ఘాట్ రోడ్డులో కేవలం ఆర్టీసీ బస్సులను మాత్రమే అనుమతించాలని నిర్ణయించింది. ప్రైవేటు వాహనాలను అనుమతించమని స్పష్టం చేసింది. మొదటి ఘాట్ రోడ్డులో మాత్రం ద్విచక్రవాహనాలకు మినహా అన్ని వాహనాలకు అనుమతిని ఇచ్చింది. సప్తగిరి తనిఖీ కేంద్రం నుంచి గరుడ విగ్రహం వరకు రద్దీ కొనసాగుతుండటంతో టీటీడీ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రైవేటు వాహనాలకు అనుమతి నిరాకరించడంతో బస్సులు ఎక్కేందుకు భక్తులు ఎగబడుతున్నారు. అలాగే అలిపిరి, శ్రీవారి మెట్టు నుంచి కొండపైకి పెద్ద సంఖ్యలో భక్తులు వెళ్తున్నారు.గరుడ వాహన సేవను వీక్షించేందుకు భక్తులు భారీగా తరలివస్తుండటంతో టీటీడీ అప్రమత్తమైంది. భక్తులకు ఎలాంటి అవంతరాలు కలగకుండా ఉండేందుకు నాలుగు మాడవీధుల్లో పర్యవేక్షణకు 64 మంది ప్రత్యేక సిబ్బంది, 14 మంది ప్రత్యేక అధికారులను నియమించారు.

# పెంపుడు కుక్కలకు వ్యాధి నిరోధక టీకాలు

తాండూర్ : ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం మంచిర్యాల జిల్లా తాండూర్ పశు వైద్యశాలలో పెంపుడు శునకాలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పశు వైద్యాధికారి పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం యజమానులకు పెంపుడు కుక్కల సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై సూచనలు చేశారు. ప్రతి యజమాని తమ పెంపుడు కుక్కలకు విధిగా టీకాలు వేయించాలని, కుక్కలను బయటికి తీసుకెళ్ళేటప్పుడు వాటి నోరు మూసి ఉండేలా మౌత్ గ్యాగ్ పెట్టాలన్నారు. పెంపుడు కుక్కల వల్ల ఇరుగు పొరుగు ఇళ్ల వారికి ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది గౌస్, రాధిక, దుర్గం కళ్యాణ్, అన్నం మల్లేష్ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు భవానీ భక్తులు మృతి

అమరావతి : తూర్పు గోదావరి జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. కాలినడకను విజయవాడ దుర్గమ్మ దర్శనానికి కాలినడకన వెళ్తున్న భవానీ భక్తుల పైకి కారు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరు భవానీలు మృతి చెందారు. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం పుల్లలపాడులో 16వ నంబర్ జాతీయ రహదారి గుండా కొంత మంది భవానీ భక్తులు కాలినడకను విజయవాడకు బయలు దేరారు.ఆదివారం అతివేగంగా వచ్చిన కారు భక్తులపైకి దూసుకెళ్లడంతో పకతి శివ(35), పకృతి శ్రీను( 22) అనే యువకులు మృతి చెందారు. ఈ ప్రమాదంలో మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతులు అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం దోసలపాడు గ్రామానికి చెందనివారిగా పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటన పట్ల హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. రోడ్డుపై నడిచివెళ్లే భవానీ భక్తుల రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన నెమలి.. రక్షించే బదులు ఈకలు పీకిన గ్రామస్తులు



న్యూఢిల్లీ: ఒక నెమలి రోడ్డు ప్రమాదంలో గాయపడింది. గమనించిన గ్రామస్తులు దానిని రక్షించడం పోయి మరింతగా హాని తలపెట్టారు. జాతీయ పక్షి అయిన నెమలి ఈకలు పీక్కొని వెళ్లారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. రోడ్డు దాటుతున్న నెమలిని ఒక వాహనం ఢీకొట్టింది. దీంతో అది తీవ్రంగా గాయపడింది. కదలలేని స్థితిలో రోడ్డుపై పడిపోయింది.కాగా, అటుగా వెళ్తున్న కొందరు వ్యక్తులు ఇది చూశారు. గాయపడిన నెమలిని రక్షించే బదులు దారుణంగా ప్రవర్తించారు. దాని ఈకలను పీక్కొని వెళ్లారు. అయితే ఈ సంఘటన ఎక్కడ జరిగింది అన్నది తెలియలేదు.మరోవైపు ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో నెటిజన్లు, జంతు ప్రేమికులు తీవ్రంగా మండిపడ్డారు. జాతీయ పక్షి పట్ల దారుణంగా వ్యవహరించిన ఆ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్, బీజేపీ నేతల ఫొటోలు పోలీసు స్టేషన్లలో పెట్టాలి

**- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**



అచ్చంపేట : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిప్పులు చెరిగారు. ఈ రాష్ట్రాన్ని నిలువునా దోచుకుంటున్న కాంగ్రెస్, బీజేపీ నేతల ఫొటోలను పోలీసు స్టేషన్లలో పెట్టాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన జన గర్జన సభలో ఆర్ఎస్పీ పాల్గొని ప్రసంగించారు.ఈ కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలో ఉన్న బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా అచ్చంపేటలో బీజేపీకి, కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలను ఎన్నో కష్టాలు పెడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాల మీద సోషల్ మీడియాలో పోస్టులు పెడితే రేవంత్ రెడ్డి కేసులు పెట్టి, రౌడీషీట్లు ఓపెన్ చేయిస్తున్నాడు.. జైల్లో పడేస్తాడట. పోలీసు స్టేషన్లలో, రౌడీషీట్లలో ఉండాల్సిన వ్యక్తి రేవంత్ రెడ్డి. ప్రజల పక్షా పోరాడుతున్నా మనం కాదు.. నిలువునా దోచుకుంటున్న కాంగ్రెస్, బీజేపీ నేతల బొమ్మలు పోలీసు స్టేషన్లలో ఉండాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్లో ఎస్సీ, ఎస్టీ, బీసీల మీద ఘోరాలకు పాల్పడుతున్నారు. దళితులపై అత్యాచారాలు జరిగేది యూపీలోనే అది తెలిసీ బీజేపీలోకి వెళ్లారా..? అని గువ్వల బాలరాజును నిలదీశారు ఆర్ఎస్పీ. మధ్యప్రదేశ్లో దళితులపై మూత్రం పోసి అవమానించారు ఈ బీజేపీ నేతలు. రోహిత్ వేములను చంపింది కూడా బీజేపీనే. ఈ కాంగ్రెస్, బీజేపీ రెండు కలిసి మళ్లీ తెలంగాణను దోచుకుని మన భవిష్యత్ను నాశనం చేసేందుకు వచ్చాయి. పాలమూరు ఎత్తిపోతల పనులను కేసీఆర్ 90 శాతం పూర్తి చేస్తే, మిగిలిన 10 శాతం పనులను నిధులు ఇవ్వకుండా రేవంత్ రెడ్డి అడ్డగించారు. మరి ఎవరు నిజమైన పాలమూరు బిడ్డ.. రేవంతా..? కేసీఆరా..? చేతులు జోడించి కోరుతున్నా రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ బీజేపీలను చిత్తుచిత్తుగా ఓడించి మళ్లీ బీఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలి. బరాబర్ ఈ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఓడించాలి అని అచ్చంపేట ప్రజలకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు.

## నవంబర్‌లో విద్యుత్ చార్జీల తగ్గింపు.. శుభవార్త చెప్పిన ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్



ఏపీవాసులకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుభవార్త తెలిపారు. నవంబర్ నుంచి విద్యుత్ ఛార్జీల తగ్గింపు ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి యూనిట్‌కు 13పైసలు తగ్గిస్తామని ప్రకటించారు. విద్యుత్ చార్జీల ట్రూడౌన్‌పై ఆదివారం తాడేపల్లిలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ మీడియాతో మాట్లాడారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమన్న హామీని నిలబెట్టుకున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. జగన్ పెంచిన ట్రూఅప్ చార్జీలను ట్రూడౌన్ చేసే దిశగా కార్యాచరణ చేపట్టామని పేర్కొన్నారు. అధిక రేట్లకు విద్యుత్ కొనుగోలు చేయడాన్ని నియంత్రించామని తెలిపారు. దీనివల్ల యూనిట్‌కు 13 పైసలు తగ్గించగలిగామని పేర్కొన్నారు. భవిష్యత్‌లో చార్జీలను మరింత తగ్గిస్తామని.. ప్రజలపై విద్యుత్ భారం పడకుండా చూస్తామని చెప్పారు. ట్రూఅప్ చార్జీల కింద రూ.926 కోట్ల వరకు తగ్గించామని అన్నారు.2014లో లోటు విద్యుత్ నుంచి 2019 నాటికి మిగులు విద్యుత్ సాధించామని తెలిపారు. కానీ వైసీపీ వచ్చిన తర్వాత విద్యుత్ అవసరాలు తీర్చలేక మళ్లీ లోటులోకి వెళ్లిందని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనుగోలు చేసిన నష్టం చేకూర్చారని విమర్శించారు. ప్రజలపై రూ.18వేల కోట్ల భారం మోపారని మండిపడ్డారు. రూ.1.25లక్షల కోట్ల వరకు విద్యుత్ వ్యవస్థకు నష్టం చేకూర్చారని అన్నారు. తాము వచ్చాక సంస్కరణలు తెచ్చి విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టామని అన్నారు. తాము తెచ్చిన సంస్కరణల వల్లే విద్యుత్ చార్జీలు తగ్గించగలిగామని అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తిని పెంచామని గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. విద్యుత్ కొనుగోళ్లకు ఎక్కువ ఖర్చు పెట్టడం తగ్గించామని అన్నారు. ఇతర రాష్ట్రాలతో విద్యుత్ ఇచ్చిపుచ్చుకునేలా వ్యవహరిస్తున్నామని అన్నారు. సూర్యఘర్ పథకం కింద ఏపీకి 20 లక్షల కనెక్షన్లు వచ్చాయని తెలిపారు. సౌరపలకలు ఏర్పాటు చేసుకున్న వారికి రాయితీ ఇస్తున్నామని చెప్పారు.

# వైసీపీ చేసిన పాపాలను మేం మోస్తున్నాం..

# మంత్రి ఆనం సంచలన వ్యాఖ్యలు

గత వైసీపీ పాలనలో ఆధ్యాత్మిక ప్రాంతాల్లో కూడా విధ్వంసం జరిగిందని ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆరోపించారు. గత పాలకులు చెప్పుకోలేని విధంగా దేవాలయాల్లో తప్పులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవాలయాల్లో వైసీపీ పాలకులు చేసిన పాపాలను తామంతా మోస్తున్నామని వివరించారు. వారి పాపాలను కడిగే విధంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ఆధ్యాత్మికతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. దేవాలయాల్లో సామాన్యులకు ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు కృష్ణా జిల్లా తోట్లవల్లూరులో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యటించారు. గ్రామంలోని తోటల శివాలయంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సనాతన ధర్మం పాటిస్తూ ఆలయాలను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. పూర్తి శాస్త్రోక్తంగా దేవాలయాల్లో భగవంతునికి పూజా కైంకర్యాలు జరిగేలా చర్చలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తిరుమల పరకామణి అంశంపై శాసనమండలిలో వివరించామని తెలిపారు. తిరుమలలోని పరకామణి విషయంలో శాసనసభలో స్పీకర్ సమయం ఇవ్వకపోవడం వల్ల మాట్లాడలేకపోయామని తెలిపారు. అందుకే మండలిలో వివరణ ఇచ్చినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో పూర్తి వివరాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 361 దేవాలయాల పునర్నిర్మాణానికి రూ.500 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఖాళీగా ఉన్న దేవాలయాల ప్రాంగణాల్లో మొక్కలు నాటించే కార్యక్రమం చేపడతామని తెలిపారు. ఆధ్యాత్మికత, భగవాన్ నామస్మరణలతో ప్రతి ఒక్కరూ నిత్యం ఆనందంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్న అన్న క్యాంటీన్ల



తరహాలోనే గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాల్లో ఉచిత అన్నప్రసాదం అందిస్తామని తెలిపారు.

## కండ్లకు గంతలు.. 70 నిమిషాల్లోనే భవానీ మాత విగ్రహం తయారీ



జహీరాబాద్ : ప్రముఖ శిల్పకారుడు కండ్లకు గంతలు కట్టుకొని భవానీ మాత విగ్రహాన్ని తయారు చేసి ఔరా అనిపించారు. దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జహీరాబాద్ మండల కేంద్రం న్యాల్కల్ గ్రామానికి చెందిన ప్రముఖ శిల్పకారుడు డాక్టర్ హెూతి బసవరాజ్ ఆదివారం భవాని మాత విగ్రహాన్ని తయారు చేశాడు. హెూతి బసవరాజ్ కొంతకాలంగా దేవతల విగ్రహాలను తయారు చేయాలని సంకల్పాన్ని పెట్టుకున్నాడు.

గత జనవరి మాసంలో అయోధ్యలో బలరాముడి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట చేస్తున్న సమయంలో బలరాముని విగ్రహాన్ని, గత నెలలో వినాయక నవరాత్రి వేడుకల్లో భాగంగా వినాయకుడి విగ్రహాన్ని తయారు చేశారు. తాజాగా భవానీమాతను తలుచుకొని ఏకాగ్రతతో విగ్రహాన్ని కేవలం 70 నిమిషాల్లోనే తయారు చేశాడు. కండ్లకు దంతాలు కట్టుకొని ఏకాగ్రతతో దేవతామూర్తులను తయారు చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం భవానీమాత విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు.

## 'నా పార్టీ టాప్‌లో లేదా కింద ఉంటుంది'.. బీహార్ ఎన్నికలపై ప్రశాంత్ కిషోర్




పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తన పార్టీ టాప్‌లో లేదా అట్టడుగున ఉంటుందని జన్ సూరజ్ పార్టీ చీఫ్ ప్రశాంత్ కిషోర్ తెలిపారు. జేడీ(యూ) 25 కంటే తక్కువ సీట్లు గెలుచుకుంటుందని, బీజేపీ కూడా ఓడిపోతుందని జోస్యం చెప్పారు. ప్రతిపక్ష కూటమి మూడో స్థానానికి పరిమితమవుతుందని అంచనా వేశారు. తన పార్టీ జన్ సూరజ్ 243 సీట్లలో పోటీ చేస్తుందని ప్రశాంత్ కిషోర్ తెలిపారు. అయితే ఎవరితోనూ పొత్తులు పెట్టుకోదని స్పష్టం చేశారు. తన పార్టీ అగ్రస్థానంలో లేదా దిగువన ఉంటుందని అన్నారు.కాగా, బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలా వద్దా అన్నది నాలుగు లేదా ఐదు రోజుల్లో తాను నిర్ణయిస్తానని ఎన్నికల వ్యూహకర్తగా, సలహాదారుగా పనిచేసి రాజకీయ నేతగా మారిన ప్రశాంత్ కిషోర్ తెలిపారు. అయితే తన కుటుంబంలో ఎవరూ ఎన్నికల్లో పోటీ చేయబోరని స్పష్టం చేశారు. మరోవైపు సీఎం నితీశ్ కుమార్ ప్రభుత్వంపై ప్రశాంత్ కిషోర్ మండిపడ్డారు. జేడీ(యూ) నేత, బీహార్ మంత్రి అశోక్ చౌదరికి పరువు నష్టం నోటీసు పంపుతానని తెలిపారు. రూ. 200 కోట్ల అవినీతికి ఆయన పాల్పడినట్లు ఆరోపించారు. కోట్ల విలువైన ఆ భూమిని తన పీఏ పేరుతో ఆయన ఎందుకు కొన్నారు? అని ప్రశ్నించారు. త్వరలోనే నలుగురు లేదా ఐదుగురు ప్రముఖ నేతల గుట్టు బయటపెడతానని ఆయన అన్నారు.

## శారద హై స్కూల్‌లో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కరీమాబాద్ : శారద హై స్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనంసిల్వర్ జూబ్లీ వేడుకలు ఆదివారం రంగశాయిపేటలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 2000- 01 బ్యాచ్ కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు శారద స్కూల్ ఆవరణలో ఒక్కచోట చేరి వారి గత స్మృతులను స్మరించుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమం లో విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం.. గాజాలో 66 వేలు దాటిన మృతుల సంఖ్య



దాదాపు రెండేళ్లుగా ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధం జరుగుతోంది. అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు ఎదురవుతున్నప్పటికీ హమాస్ రెబెల్స్ లక్ష్యంగా గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఆపడం లేదు. ఈ దాడువల్ల గాజాలో మృతుల సంఖ్య 66 వేలు దాటింది. దాదాపు 1.68 లక్షల మంది గాయపడ్డారు.గాజా ఆరోగ్య శాఖ ఈ విషయాన్ని వెల్లడించింది. మృతుల్లో దాదాపు సగం మంది మహిళలు, చిన్నారులేనని అంచనా వేసింది. శిథిలాల కింద వేల మంది చిక్కుకున్నట్లు భావిస్తోంది. గత 24 గంటల్లోనే 79 మంది మరణించినట్లు తెలిపింది. అయితే మొత్తం మృతుల సంఖ్యలో సామాన్య పౌరులు ఎందరు, యుద్ధంలో పాల్గొన్న వారు ఎంతమంది ఉన్నారనే విషయంపై స్పష్టత ఇవ్వలేదని పేర్కొంది.2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ ఉగ్రవాదులు మెరుపుదాడులకు పాల్పడటంతో.. హమాస్ నెట్‌వర్క్ అంతమే లక్ష్యంగా అప్పటి నుంచి ఇజ్రాయెల్ గాజాపై విరుచుకుపడుతోంది. ఫలితంగా గాజా జనాభాలో దాదాపు 90 శాతం మంది నిరాశ్రయులయ్యారు. మరణాలతోపాటు పెద్దఎత్తున విధ్వంసం, మానవతా సంక్షోభం, కరవుతో పరిస్థితులు దుర్భరంగా మారాయి. కొన్నిరోజులుగా గాజా సిటీ లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులను ముమ్మరం చేసింది. మరోవైపు ప్రపంచ దేశాలు నెతన్యాహు సర్కారు తీరును తీవ్రంగా తప్పుపడుతున్నాయి. కాగా ఇటీవల ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడా దేశాలు పాలస్తీనాను దేశంగా గుర్తించాయి.

## మన వ్యవస్థలో ఏదో లోపముంది.. తొక్కిసలాట ఘటనపై శశిథరూర్



కరూర్ తొక్కిసలాట ఘటనలో 40 మంది ప్రాణాలు కోల్పోవడంపై కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. దేశంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న ఇలాంటి ఘటనలు మన వ్యవస్థలో ఉన్న లోపాలను ఎత్తి చూపుతున్నాయని అన్నారు.ఇటీవల ఆర్సీబీ సంబురాల సందర్భంగా బెంగళూరులో జరిగిన తొక్కిసలాటలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడాన్ని కూడా థరూర్ గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమవ్వాలన్నారు. ప్రముఖులు నిర్వహించే అన్ని రకాల కార్యక్రమాలకు కఠిన నియమాలను, భద్రతా ప్రొటోకాల్‌లను రూపొందించాలని సూచించారు.

మన దేశంలో జనసమూహ నిర్వహణను అమలు చేయడంలోనే ఏదో తప్పు జరుగుతోందని, అందువల్లే ప్రతి ఏడాది ఏదో ఒక ప్రాంతంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. సాధారణ ప్రజల భద్రత, ప్రాణాలను దృష్టిలో పెట్టుకుని జాతీయ స్థాయిలో ఇలాంటి సభలు, సమావేశాల నిర్వహణకు కఠిన నిబంధనలు రూపొందించాలని కోరారు.

## జగన్ సీఎం కాగానే.. ఫస్ట్ డిజిటల్ బుక్‌నే తెరుస్తాం.. కూటమి నేతలకు జోగి రమేశ్ హెచ్చరిక

వైసీపీ కార్యకర్తలను కూటమి ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని మాజీ మంత్రి జోగి రమేశ్ అన్నారు. ఏడాది గడిచినా కూటమి నేతలు జగన్‌నే స్మరిస్తున్నారని అన్నారు. మరో రెండేళ్ల తర్వాత ఎన్నికలకు వెళ్లబోతున్నామని.. అప్పుడు వైసీపీ ప్రభుత్వమే వస్తుందని చెప్పారు.జగన్ సీఎం కాగానే మొదట తెరిచేది డిజిటల్‌బుక్‌నే అని స్పష్టం చేశారు. తప్పు చేసిన వాళ్లు ఎక్కడున్నా తీసుకొచ్చి నిలబెడతారని తెలిపారు.ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది ప్రజలను పీడించడానికే అని వైసీపీ సీనియర్ నాయకుడు కురసాల కన్నబాబు విమర్శించారు.



రెడ్‌బుక్ కోసం పోలీసులను ఆయుధాలుగా వాడుతున్నారని అన్నారు. కొడుకు తప్పు చేస్తే తప్పని చెప్పాల్సింది పోయి.. చంద్రబాబే ఆయన వేధింపులను నేర్పిస్తున్నారని వ్యాఖ్యానించారు. కార్యకర్తలను కాపాడుకోవడం కోసమే వైఎస్ జగన్ డిజిటల్ బుక్‌ను ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రజలకు సంక్షేమం ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. ఫలానా పథకం రాలేదని అడగాలంటే భయపడే పరిస్థితి వచ్చిందన్నారు. ఈ అన్యాయాలు అన్నింటినీ తప్పుకుండా డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తామని చెప్పారు.

# ప్రపంచ ఆయుర్వేద దినోత్సవం

## జగిత్యాలలో శ్రీ ధన్వంతరి జయంతి ఉత్సవాలు ఘనం









**జగిత్యాల (ప్రశ్న న్యూస్)** భారతీయ సనాతన వైద్యవిధానమైన ఆయుర్వేదం నేడు ప్రపంచవ్యాప్తంగా విశేష గుర్తింపు పొందుతున్న తరుణంలో, ఆయుర్వేద పితామహులు శ్రీ భగవాన్ ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని జగిత్యాలలోని చారిత్రక శ్రీ సూర్యనారాయణ ధన్వంతరి ఆలయంలో ప్రపంచ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ఉత్సవాలు ఘనంగా జరిగాయి. భారత ప్రభుత్వం ధన్వంతరి జయంతి రోజున (సెప్టెంబర్ 23) ప్రపంచ ఆయుర్వేద దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించడం, ఈ సందర్భంగా తెలంగాణలోని జగిత్యాలలో ధన్వంతరి ఆలయం ఉండటం రాష్ట్రానికే గర్వకారణమని ఈ వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు అభిప్రాయపడ్డారు. లక్ష్మణ స్వామి సారథ్యంలో వేడుకలు, సన్మానంహైదరాబాద్‌కు చెందిన ప్రముఖ అనువంశిక ఆయుర్వేద వైద్యులు శ్రీ సింహాచలం లక్ష్మణ స్వామి సారథ్యంలో, దేశీయ మహా మూలిక వైద్య సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. లక్ష్మణ స్వామి, ఆలయ వ్యవస్థాపకులు శ్రీ వడ్లగడ్డ రాజన్న ని ఘనంగా సన్మానించారు. ఆయుర్వేద వైశిష్ట్యాన్ని, జీవన వికాసానికి అవసరమైన విధానాలను ఆలయ నిర్వాహకులకు ఆయన క్షుణ్ణంగా వివరించారు.

**ఆయుర్వేదం- ఆధునిక పోకడలు:**

లక్ష్మణ స్వామి సందేశం

కరోనా మహమ్మారి తర్వాత ప్రపంచం మొత్తం ఆయుర్వేద జీవన విధానం, భారతీయ సంస్కృతిలో అంతర్లీనంగా ఉన్న రోగనిరోధక శక్తి ప్రాధాన్యతను గుర్తించిన నేపథ్యంలో, ఆయుర్వేద వైద్యానికి మరింత గుర్తింపు రావడం సముచితమని లక్ష్మణ స్వామి పేర్కొన్నారు.




అనువంశిక ఆయుర్వేద వైద్యుల గుర్తింపు, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను గురించి ఆయన శాస్త్రీయంగా వివరించిన ముఖ్యాంశాలు..

**పరంపర వైద్యుల గుర్తింపు:** సాంప్రదాయ అనువంశిక వైద్యులను ప్రభుత్వం తప్పకుండా గుర్తించి, వారికి తగిన గౌరవం అందించాలి. ఆయుర్వేద జీవన విజ్ఞానం భావితరాలకు అందడానికి వారి కృషి ఎంతో అవసరం.

వనమూలికల పెంపకం..ప్రతి గ్రామంలో, పట్టణంలో ఆయుర్వేద చికిత్సాలయాలు ఏర్పడాలి, వనమూలికల పెంపకానికి ప్రోత్సాహం అందించాలి.

**ఔషధాల శాస్త్రీయ నిరూపణ:** ఔషధాల శాస్త్రీయ నిరూపణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆయుష్ లైసెన్సు పొందే విధానాలపై వివరణ ఇచ్చారు.

**ఆధునిక వైద్యంతో సమ్మిళితం:** ఆయుర్వేద శాస్త్రాన్ని ఆధునిక శాస్త్రంతో మేళవించి మరింత అద్భుతంగా ముందుకు తీసుకెళ్లాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు.

ప్రభుత్వ ప్రోత్సాహం: సహజసిద్ధమైన, సైడ్ ఎఫెక్టులు లేని ఆయుర్వేద వైద్య విధానానికి ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందించాలి. జగిత్యాల ధన్వంతరి ఆలయం: భవిష్యత్తు ప్రణాళికలు

తెలంగాణకే తలమానికమైన ఈ ధన్వంతరి ఆలయాన్ని భవిష్యత్తులో మరింతగా అభివృద్ధి చేయడానికి, ప్రపంచానికి పరిచయం చేయడానికి అనేక రకాల ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్టు లక్ష్మణ స్వామి తెలిపారు.

### రాష్ట్రస్థాయి ఉత్సవాలు..

రానున్న నవంబర్ నెలలో ఇదే ఆలయంలో ధన్వంతరి జయంతి ఉత్సవాలను మరింత అద్భుతంగా, గొప్పగా రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్నట్టు ఆలయ ట్రస్ట్ వ్యవస్థాపకులు వడ్లగడ్డ రాజన్న, ఇతర సభ్యులు ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో ఎనగందుల రవితేజ, ఆచార్య హరీష్ దైవజ్ఞ, జిందం కమలాకర్, ఎనగందుల హనుమాన్లు, మామిడిపల్లి కాంతయ్య, పడాల చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ పోరాటస్ఫూర్తితో విద్యార్థులు యువకులు ఉద్యమించాలి..!!

*భగత్ సింగ్ జీవిత చరిత్ర పాఠ్య పుస్తకాల్లో చేర్చాలి..*

*ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి వేడుకలు..*



జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) సెప్టెంబర్ 28: మండలకేంద్రంలోని ఏఐఎస్ఎఫ్-ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 118వ జయంతిని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కెై చాంద్ పాషా మాట్లాడుతూ భగత్ సింగ్ జీవితం భారత దేశ యువత స్ఫూర్తిదాయకమని, అటువంటి మహనీయుని త్యాగాలను నేటి సమాజానికి తెలియజేసే భాధ్యత పాలకులదేనని వారు అన్నారు. భగత్ సింగ్ జయంతిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు తక్షణమే భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించి యువతకు ఉద్యోగాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజల ఐక్యతను చీల్చే మతోన్మాద రాజకీయలు నేడు దేశంలో విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని, స్వాతంత్ర్య ఉద్యమ కాలంలోనైనా, నేటి కాలంలోనైనా అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చి దోపిడీదారులకు ఉపకరించే, దేశ ద్రోహు కర్తవ్యాన్నే మతోన్మాదు శక్తులు నెరవేరుస్తున్నాయని వారు అన్నారు. దేశ స్వాతంత్ర్య ధ్యేయంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన భగత్ సింగ్ స్వాతంత్ర్య అనంతరం కుల, మతాలకు అతీతంగా ధనిక, పేద తారతమ్యాలు లేని సమసమాజ స్థాపన కోసం భగత్ సింగ్ కలలు కన్నాడన్నారు భగత్ సింగ్ భారత దేశ స్వాతంత్ర్య కోసం చేసిన పోరాటం ఆలోచనలు,ఆయన చూపిన కార్యాచరణ,మనకు తరగని స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నవీన్ ,రామ్,గణేష్,సాయి తేజ,హేమంత్ నాయక్ ఏఐవైఎఫ్ నాయకులు పవన్,

## తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా నియోజకవర్గ మండల కమిటీలు ఏర్పాటు

జగిత్యాల జిల్లా (ప్రశ్న న్యూస్)జగిత్యాల జిల్లా నియోజకవర్గ మండల కమిటీల ఏర్పాటుకు తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం సెంట్రల్ కమిటీ ఆమోదించింది. ఆసక్తి గల జర్నలిస్టులు / రిపోర్టర్లు సంప్రదించవలసిన నెంబర్ , పూర్తి వివరాలు 7386863999 వాట్సాప్ చెయ్యగలరు. ధర్మపురి, జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాలలోని అన్ని మండలాల్లో కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆనం చిన్ని వెంకటేశ్వర రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌటి రామక్రిష్ణ, జగిత్యాల జిల్లా ఇంచార్జి: ఏ సంజయ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రతి ఇంటికి ఆనందం - ఐక్యతకు ప్రతీకలుగా బతుకమ్మ - దసరా పండుగలు

**- జిల్లా ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ**

**- దసరా పండుగ శుభాకాంక్షలు**

**- భాజపా జిల్లా నాయకులు : అనుమల్ల చంద్రమౌళి**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా నాయకులు అనుమల్ల చంద్రమౌళి జిల్లా ప్రజలకు సద్దుల బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "బతుకమ్మ పండుగ మన సంస్కృతికి, ఐక్యతకు ప్రతీక. పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలు కుటుంబసభ్యుల మధ్య అనుబంధాన్ని పెంపొందిస్తాయి. దసరా పండుగ కూడా సనాతన సంప్రదాయాలను నిలిపి, ప్రతీ ఇంటికి శాంతి, ఆనందం తీసుకువస్తుంది, విజయానికి ప్రతీకగా విజయదశమి దసరా పండుగ" అని అన్నారు. ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో విలసిల్లుతూ, ఆనందోత్సాలతో పండుగలు జరుపుకోవాలని ఆకాంక్షించి,సద్దుల బతుకమ్మ- దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## కల్తీ వస్తువులపై కఠిన చర్యలు

**- వినియోగదారుల సంక్షేమ సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షులు : తొగరి కరుణాకర్**

**- తెలంగాణ వినియోగదారుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా తొగరి కరుణాకర్ ఎన్నిక**



వేములవాడ (ప్రశ్న న్యూస్ )తెలంగాణ రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన వస్తువులు అందించడం,కల్తీ వస్తువుల వ్యాప్తిని నివారించడం లక్ష్యంగా తెలంగాణ వినియోగదారుల సంక్షేమ సంఘం నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా తొగరి కరుణాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వేములవాడలో ఆదివారం జరిగిన సమావేశంలో అడహాక్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ, సూపర్‌మార్కెట్లు, బట్టల దుకాణాలు, వాహన షోరూమ్‌లు అఫర్ల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నాయని,త్వరలో రాష్ట్రవ్యాప్తంగా వినియోగదారుల ఫోరంలో కేసులు వేయబోతోందని హెచ్చరించారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో కమిటీల నియామకాలు త్వరలో జరుగుతాయని, కొందరు వ్యాపారులు ప్రజలను మోసం చేస్తున్నట్లు గుర్తిస్తే, సంబంధిత శాఖకు సమాచారం అందించడమే కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నూతన రాష్ట్ర కమిటీ సభ్యులను ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా సయ్యద్ షబ్బీర్,మహమ్మద్ అబ్దుల్ సలీమ్,ప్రధాన కార్యదర్శిగా నిమ్మశెట్టి రాజు,జాయింట్ సెక్రటరీలుగా కనికరపు శ్రీనివాస్,పంపరి నాగరాజు,కోశాధికారిగా నందగిరి చంద్రశేఖర్,న్యాయ సలహాదారులుగా మారుపాక నాగార్జున,ముత్యం రాము, కార్యవర్గ సభ్యులుగా రామతీర్థం కృష్ణవేణి,చింత పూర్ణిమ దేవి,గుడిసె ప్రవీణ్ లు ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో తొగరి కరుణాకర్ యువత, యువకులు, సామాజిక కార్యకర్తలందరిని సంఘంలో చేరి వినియోగదారుల హక్కుల కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్ నిధులతో నాంపల్లి రేణుక ఎల్లమ్మ ఆలయంలో నూతన బోరు బావి

**- వేములవాడ పట్టణ భాజపా అధ్యక్షులు ,: రాపెల్లి శ్రీధర్**



వేములవాడ ,(ప్రశ్న న్యూస్) కరీంనగర్ ఎంపీ,కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఎంపీ నిధులతో నాంపల్లి గ్రామంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో నూతన బోరుబావికి ఆదివారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో బీజేపీ వేములవాడ పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు శ్రీధర్ మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికలలో ప్రజల కోసం మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతాయని, ఈ బోర్ వెల్ కూడా అదే లక్ష్యంతో ఏర్పాటు చేయబడిందని అన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు గోపి మాట్లాడుతూ "ఎన్నికల తర్వాత కూడా అభివృద్ధిలో అన్ని పార్టీలతో కలిసి పనిచేస్తాము. వేములవాడ పట్టణానికి మరిన్ని నిధులు వచ్చేలా కృషి చేస్తాం" అని. ఈ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, స్థానిక నాయకులు, బూత్ అధ్యక్షులు, నాంపల్లి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అమాయక భారతం

**మత బేధము మా మనసులో లేదు**
**ఓట్ల రోజు మా వేలుకు పూనున్**
**కులతత్వము మా కంటికి కానదు**
**ప్రేమ పెళ్లిలో కన్న బిడ్డనే కసిగా నరికిన కత్తి పదునుకు తెలియున్**
**వర్ణ బేధము మా వాకిట నిలువదు**
**అద్దె ఇంటికై తిరిగి అరిగిన తక్కువ జాతోడి చెప్పుకు తెలియున్**
**మా భరతమాతకు జయమనే అరుపుల**
**కొదవే లేదు**
**వివస్త్రను చేసి ఊరేగిస్తే విలపించిన వీధి**
**కుక్కకు తెలియున్.**



**నేపా సంతోష్ అచ్యుత్ కుమార్,**
**అసిస్టెంట్ ప్రొఫెసర్, కాళోజి ప్రతిభ**
**పురస్కార గ్రహీత.8639442397**

## 'మీరిచ్చే డబ్బులతో మా అక్క ప్రాణాలు తిరిగొస్తాయా'.. తొక్కిసలాట మృతురాలి సోదరి





కరూర్ తొక్కిసలాట ఘటన తమిళనాడు రాష్ట్రంలో పెను విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనలో మొత్తం 40 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 50 మందికిపైగా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో మృతుల కుటుంబాలకు నటుడు విజయ్ రూ.20 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. దీనిపై ఓ మృతురాలి సోదరి తీవ్రంగా స్పందించారు.'మీరు పరిహారంగా ఇచ్చే నగదుతో మా అక్క ప్రాణాలు తిరిగొస్తాయా..?' అని ఆమె ప్రశ్నించారు. 'మీ డబ్బులు మాకొద్దు.. పోయిన మా అక్క ప్రాణాలు కావాలి' అని డిమాండ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బృంద అనే మహిళ నటుడు విజయ్‌కి పెద్ద అభిమాని. శనివారం విజయ్ కరూర్‌లో ప్రచారానికి వస్తున్నాడని తెలిసి బృంద ఆయనను చూసేందుకు తహతహలాడింది. పసివాడైన తన కుమారుడిని చెల్లెలి దగ్గర వదిలి వెళ్లింది. కానీ అక్కడ జరిగిన తొక్కిసలాటలో ఆమె ప్రాణాలు కోల్పోయింది. కరూర్ ర్యాలీలో తొక్కిసలాట గురించి తెలుసుకున్న బృంద కుటుంబసభ్యులు ఆమెకు ఎన్నిసార్లు ఫోన్‌లు చేసినా స్పందన లేదు. రాత్రి 10 గంటల తర్వాత ఆమె ఫోన్ స్విచాఫ్ అయ్యింది. ఆదివారం ఉదయం ర్యాలీ నిర్వాహకులకు బృంద భర్త ఆమె ఫొటోను పంపించగా ఆమె మరణించినట్లు తెలిపారు. దాంతో ఆ కుటుంబం శోకసంద్రమైంది. కాగా కరూర్‌లో శనివారం రాత్రి నటుడు, టీవీకే చీఫ్ విజయ్ నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాటలో 40 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 50 మందికిపైగా గాయపడ్డారు. మృతుల కటుంబాలకు విజయ్ రూ.20 లక్షల చొప్పున, తమిళనాడు ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున, కేంద్రం రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది.

## కుల, మత అసమానతలపై గుర్రం జాషువా అక్షర యుద్ధం

**- ఓరుగంటి సాంబయ్య**

కాజీపేట : కుల, మత అసమానత లు లేని సమ సమాజ నిర్మాణం కొరకు కలంతో పోరాటం చేసిన మహాకవి గుర్రం జాషువా యని కెవిపిఎస్ హనుమ కొండ జిల్లా అధ్యక్షులు ఓరుగంటి సాంబయ్య అన్నారు. కాజీపేట పట్టణంలో మహాకవి గుర్రం జాషువా 130 వ జయంతి ని ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. మహాకవి జాషువా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఓరుగంటి సాంబయ్య మాట్లాడుతూ.. భారత దేశ సామాజిక, సాహిత్య రంగంలో జాషువా కవిత్వం ఓ చైతన్య స్ఫూర్తి అన్నారు. కులమత బేధాలు పేదరికం తన గురువుగా భావిస్తున్నా నని చెప్పిన జాషువా వాటి మూలాల పై కలం యుద్ధం చేశాడన్నారు. కర్మ సిద్ధాంతము పేర కోట్లాది మంది కష్ట జీవులను అణిచివేత, దోపిడికి గురిచేసిన మనువాద విష సంస్కృతి పై మహోద్యమం నిర్మించాడని చెప్పారు. దేవుని గుడిలోకి ప్రవేశం లేని దళితుల గోడు వినిపించమని గబ్బిలం అనే రచన ద్వారా పంపిన సందేశం ఒక తిరుగు బాటు అన్నారు. ప్రజలు, కెవిపిఎస్ నాయకులు, కార్య కర్తలు పీడిత వర్గాన్ని ఐక్యం చేసి పీడిత వర్గాన్ని దోచుకునే దోపిడీ అసమానతలపై పోరాడి జాషువా కలలుగన్న ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ కాజీపేట మండల నాయకులు తిక్క సాంబయ్య, రేఖ, రజిత, సునీత పాల్గొన్నారు.

## సిరిసిల్లలో వాహన నెంబర్ ప్లేట్ మార్పుపై కల్పిత ప్రచారాలకు డీటీఓ స్పష్టం

**- హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్లకు గడువు లేదు**

**- ఆందోళన చెందవద్దు**

**- జిల్లా రవాణా శాఖ అధికారి : లక్ష్మణ్**



సిరిసిల్ల / వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ వివరించినట్లు, వాహన నెంబర్ ప్లేట్లను హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (HSRP) గా మార్చుకోవడానికి ఎలాంటి గడువు విధించబడలేదు. సోషల్ మీడియాలో "ఈ నెల 30 వరకు తప్పనిసరిగా HSRP ఏర్పాటు చేయాలి, లేదంటే జరిమానాలు విధిస్తారు" అనే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ జిల్లా ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెంబర్ ప్లేట్ మార్పు ఇంకా ప్రభుత్వ పరిశీలనలో ఉందని, ఎలాంటి అధికారిక ఆదేశాలు రాలేదని,తప్పుడు ప్రచారాలను నమ్మి, ఆందోళన చెందవద్దని డీటీఓ లక్ష్మణ్ స్పష్టం చేశారు.

## ఎల్ఓసీతో చేయూత, బాసటగా మేమున్నాం:ముద్దం



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ఎల్ఓసీ చెక్కు 2.50.000/బాధితులకు అందజేశారు. వివరాల్లోకి వెళ్తే బోయిన్ పల్లి ప్రాంతంలో పి.రాములు గంగపుత్ర సంఘం నివాసి.ఆయన గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో నిమ్స్ హాస్పటల్లో చికిత్స పొందుతున్నారు. కడు నిరుపేద కుటుంబానికి చెందిన పి.రాములు, వైద్య పరీక్షలు, ఔషాదాలకు చిల్లీ గవ్వ లేదని ఆయన సతీమణి స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ వద్ద కన్నీటిపర్యంతమయ్యారు. వేంటనే ముద్దం యుద్ధప్రాతిపదికన తెల్ల రేషన్ కార్డు (దారిద్రాపురేఖ) కింద ఉన్న పి.రాములు వైద్య నివేదికలు తీసుకుని ప్రభుత్వానికి ఎల్ఓసీ కింద మంజూరైన రెండున్నర లక్షల రూపాయలు చెక్ నిన్న ఆయన నివాసంలో రాములు కుటుంబానికి అందజేశారు.గత కొంతకాలంగా ఆర్థక ఇబ్బందులతో తలమునకలైతున్న వారికి స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ ప్రోత్సాహంతో కాస్త ఊరట లభించిందని రాములు సతీమణి తెలిపారు.దేవి సన్నీధిలో ముద్దం తనయుడు....తెలుగు రాష్ట్రాల్లో దేవి శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నారు.తొమ్మిది రోజుల్లో 9 రూపాల్లో దర్శనమిస్తున్న జగన్మాత.ఈనేపథ్యంలో నిన్న ఆదివారం ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ మల్లికార్జున్ నగర్ కాలనీ రోడ్ నెంబర్ 4 లో నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ తనయుడు యువ నాయకుడు ముద్దం మల్లికార్జున్ యాదవ్. ఆయనను సాధారంగా ఆహ్వానించి అమ్మ సన్నీధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలాగే శాలువాతో సన్మానం చేసి దేవి శరన్నవరాత్రులు శుభాకాంక్షలు తెలియజేశారుకమిటీ పెద్దలు.అసొసియేషన్ సభ్యులు ధర్మయ్య, సుబ్బు, మనీ, బుర్రి యాదగిరి చందు యాదవ్, శేఖర్ యాదవ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## జాషువా కవితా గర్జన - అసమానతలపై ఆవేదన

**- ధర్మ టీచర్ యూనియన్ జిల్లా కన్వీనర్ : సంపతి రమేష్**

**- ధర్మ టీచర్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా గుర్రం జాషువా జయంతి వేడుకలు**



సిరిసిల్ల / వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆదివారం "ధర్మ టీచర్ యూనియన్" ఆధ్వర్యంలో ప్రముఖ కవి గుర్రం జాషువా 130వ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ సంపతి రమేష్ మాట్లాడుతూ, జాషువా కవితలు కల,మత, సామాజిక భేదాలను అతి నిబద్ధంగా ప్రతిబింబిస్తాయని అన్నారు.జాషువా "చెప్పులు కుట్టు వాని సేవకు భరతవాని అప్పు పడ్డది సుమీ" అనే ప్రసిద్ధ వాక్యాన్ని ఉదహరించి, వేల ఏళ్ళుగా ఏమి ఆశించకుండా చెప్పులు కుట్టిన మానవులకూ,శ్రామిక,శూద్ర కులాలకూ సమాజం రుణపడి ఉందని అన్నారు. ఆయన సమాజంలో ఉన్న అసమానతలపై పోరాటం నేటికీ అవసరమని, ప్రతి ఒక్కరూ ఈ మార్గంలో ఆలోచించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ధర్మ టీచర్ యూనియన్ జిల్లా బాధ్యులు మల్యాల రామస్వామి, కేసుగాని దేవయ్య, కమలాకర్, అంజన్ బాబు, రంజిత్, సురేష్, రాజయ్య, శేఖర్, విజయ్, జింక శ్రీధర్, శ్రీనివాస్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## కొరికలు తీర్చే కొల్హాపూర్ మహాలక్ష్మి

**- ఎమ్మెల్యే శ్రీ గణేష్**

**కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీగణేష్**

**కంటోన్మెంట్ ప్రజలు అష్టైశ్వర్యాలతో ఆనందంగా ఉండాలని మహదేవిని కొరినఎమ్మెల్యే**

**రేపటి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుంది శ్రీ గణేష్**



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ దేవి శరన్నవరాత్రుల సందర్భంగా అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన కొల్హాపూర్ మహాలక్ష్మి దేవినిదర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.గత కొన్ని రోజులుగా నియోజకవర్గంలో ప్రజల సేవలో తడిసి ముద్దయ్యనా ఎమ్మెల్యే కాస్త ఊరట కోసం ఆధ్యాత్మిక వైపు రెండు రోజులు తీర్థయాత్రలకు పయాణం అయ్యారు.ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని మహాలక్ష్మి దేవి ప్రత్యేకంగా కోరుకున్నారు.అలాగే రాబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని అమ్మ సన్నీధిలో కొరుకున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్.అనంతరం దేవలయ ప్రాంగణంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# అద్యంత రహిత శక్తిస్వరూపిని సరస్వతి దేవి



శరన్నవరాత్రుల్లో సరస్వతి దేవి అలంకరణ
సరస్వతి నమస్తుభ్యం వరదే కామరూపిణి
విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతు మే సదా
శరన్నవరాత్రుల్లో భాగంగా ఆమ్మవారు చదువుల తల్లి సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనం ఇస్తున్నారు.

శరన్నవరాత్రుల్లో అమ్మవారి జన్మ నక్షత్రమైన మూల నక్షత్రం రోజు అమ్మ వారిని సరస్వతీ దేవిగా ఆరాధిస్తాం.

సరస్వతీదేవి అలంకార విశిష్టత

త్రిశక్తి స్వరూపిణియైన దుర్గాదేవి తనలోని నిజరూపాన్ని సాక్షాత్కరింప చేయడమే మూల నక్షత్రం నాడు చేసే అలంకార విశిష్టత. చింతామణి, జ్ఞాన, నీల, ఘట, కిణి, అంతరిక్ష, మహా సరస్వతులుగా సప్త నామాలతో పూజింపబడే ఆ చదువుల తల్లి సరస్వతి ప్రాణుల నాలుకపై నర్తించే బుద్ధి ప్రదాయిని. జ్ఞాన ప్రధాత, పరాశక్తి తొలి ఐదు రూపాల్లో సరస్వతి దేవి అవతారం ఒకటి. ఆ మాత కేవలం చదువులనే కాక సర్వశక్తి సామర్థ్యాలను తన భక్తులకు ప్రసాదిస్తుందని దేవీ భాగవతం, నవమ స్కంధం ఐదో అధ్యాయంలో పేర్కొన్నారు. మహామాయ, భాషా జ్యోతిర్మయి, కళారస హృదయగా సరస్వతీ దేవి పూజలు అందుకుంటుంది. సరస్వతీ దేవి ఒక దేవతగా, జ్ఞానం, విద్య, కళలు, సంగీతం, భాష, సంస్కృతికి దేవతగా ప్రసిద్ధి చెందింది. ఋగ్వేదం, దేవీ భాగవతం, బ్రహ్మ వైవర్త పురాణం, పద్మ పురాణంలో సరస్వతి దేవికి సంబందించిన వివిధ గాథలు ప్రచారంలో ఉన్నాయి. సరస్వతి దేవి ఆద్యంత రహిత శక్తి స్వరూపిణి అని వివిధ స్తోత్రాలలో స్తుతిస్తారు. సకల సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడు సరస్వతి దేవిని కూడా సృష్టించాడని, సృష్టి కార్యంలో తనకు తోడుగా ఉండేందుకై తన జిహ్వపై ఆమెను ధరించాడనీ పురాణాల్లో పేర్కొన్నారు. సృష్టి కార్యాన్ని నిర్వహించడానికి బ్రహ్మకు శక్తి స్వరూపిణిగా సరస్వతిని శ్రీమాతాదేవి ప్రసాదించిందని దేవీ భాగవతంలో పేర్కొన్నారు. సరస్వతి దేవిని బ్రహ్మకు మహావిష్ణువు ప్రసాధించాడని మరొక గాథ.వాక్, బుద్ధి, వివేకం, విద్య, కళలు, విజ్ఞానం వీటన్నింటికీ అధిదేవతగా సరస్వతి దేవిని పూజిస్తారు. ఈ అమ్మవారు హంస వాహినిగా, వీణాపాణిగా, పుస్తక మాలాధారిణిగా స్థుతించబడుతుంది.



**రవికుమార్ సంతోజు**
**బడంగ్ పేట్ రంగారెడ్డి (జిల్లా)**

## గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలి

**- ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి**

**- కడారి రాములు డిమాండ్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ అర్బన్ మండలంలోని నారాయణ కాలనీ లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై ఆవేదన వ్యక్తంచేసి, గత 3 నెలలుగా కార్మికులకు వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, బతుకమ్మ, దసరా, దీపావళి పండుగల సమయాన్ని దృష్టిలో పెట్టుకొని వెంటనే వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.కడారి రాములు వెల్లడించిన ప్రధాన డిమాండ్లలో ప్రతి కార్మికునికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం, కనీస వేతనం 26,000 రూపాయలు నిర్ణయించడం, గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం, ప్రమాద భీమా సౌకర్యం 25 లక్షల రూపాయల వరకు కల్పించడం, గ్రామపంచాయతీ ట్రాక్టర్లు, వాహనాలకు ఇన్సూరెన్స్ చేయడం, కార్మికులకు హెల్త్ కార్డులు అందించడం ఉన్నాయి.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ దుద్రపల్లి రవీందర్, ఈసరి. దేవన్న, దుద్రపల్లి లక్ష్మన్, మాన్వాడ పరమేశ్వర్, కురుమ్ గుండయ్య, నేరెళ్ల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని రాములు విజ్ఞప్తి చేశారు.

## భక్తి - ఐక్యత - సామరస్యంగా పండుగలు జరుపుకోవాలి

**- పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి**

**- చొప్పదండి నియోజకవర్గ ప్రజలకు సద్దుల బతుకమ్మ - దసరా శుభాకాంక్షలు**

**- ప్రముఖ సామాజిక వేత్త, టీఎల్ యువసేన అధినేత : తూడి లచ్చన్న**



గంగాధర (ప్రశ్న న్యూస్) చొప్పదండి నియోజకవర్గానికి చెందిన ప్రముఖ సామాజిక వేత్త, టీఎల్ యువసేన అధినేత తూడి లచ్చన్న గత కొంత కాలంగా నియోజకవర్గం వ్యాప్తంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల హృదయాల్లో తనదైన శైలిలో ముద్ర వేశారు.సద్దుల బతుకమ్మ,దసరా పండుగల నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలను తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి, సాంప్రదాయాల ప్రాధాన్యతను గుర్తు చేస్తూ, "పండుగలు మన సంస్కృతి ఆత్మకు ఆహ్లాదకరమైన భక్తి మార్గాన్ని చూపిస్తాయి.ప్రజలందరూ ఐక్యతతో, ప్రేమతో,సామరస్యంగా సద్దుల బతుకమ్మ,దసరా ఉత్సవాలను జరుపుకోవాలి.భగవంతుని కృపా కటాక్షాలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, ఒకరికొకరు సహకరించి,సామాజిక ఐక్యతను మరింత బలపరచాలని కోరుకుంటున్నాను" అని ఆకాంక్షించారు.తూడి లచ్చన్న ప్రతి పండుగలో ఆరోగ్యం, భద్రత, సాంప్రదాయాల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

## ఎస్టీ జాబితా నుండి లంబాడీలను తొలగించాలి..!!

**ఆదివాసి బహిరంగ సభకు తరలిన జూలూరుపాడు మండల ఆదివాసీలు.**



జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) సెప్టెంబర్ 28: లంబాడాలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి 9 ఉపకులాల ఆధ్వర్యంలో చలో భద్రాచలం అంటూ కదం తొక్కారు. జూలూరుపాడు మండలం ఆదివాసి ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో అనంతారం గ్రామం నుండి ఆదివాసీలు డప్పుల దరువులతో జై ఆదివాసి జై జై ఆదివాసి అనే నినాదాలతో భద్రాచలంలో ఏర్పాటు చేసిన ధర్మ యుద్ధం బహిరంగ సభకు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసులు దేశానికి మూలవాసులని 1976 అనంతరం లంబాడాలను అప్పటి ప్రభుత్వం మోసం చేసి ఎస్టీ జాబితాలో చేర్పించిందని వారిని వెంటనే ఎస్టీ జాబితాలో నుంచి తొలగించాలని లేనిపక్షంలో శాంతియుత ఆందోళనలు కొనసాగిస్తామని అన్నారు. 9 ఉపకులాల సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొని తదుపరి కార్యక్రమాలకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు

## డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి వేడుకలు




జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) భగత్ సింగ్ 118 వ జయంతి జూలూరుపాడు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక కంగాల బుచ్చయ్య భవన్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వలమల చందర్ రావు మాట్లాడుతూ భగత్ సింగ్ తన చిన్న వయసులోనే ఈ దేశం కోసం పోరాడుతూ 23 ఏళ్ల వయసులో దేశం కోసం ప్రాణాలు అర్పించినటువంటి గొప్ప వ్యక్తి అని అన్నారు. భగత్ సింగ్ నిత్య అధ్యయనశీలి, నిరంతరం పోరాట రూపకర్తగా ఎన్నో స్వాతంత్ర ఉద్యమాలు చేసి ఈ దేశానికి స్వతంత్రం తెచ్చినటువంటి వ్యక్తిలో ముందుండి తమ పోరాట ప్రతిమను ప్రదర్శించారని అన్నారు. నేడు యువత భగత్ సింగ్ ను ఆదర్శంగా తీసుకొని ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ చేస్తున్నటువంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మద్యం, గంజాయి మదకద్రవ్యాలను విడనాడి దేశంలో రాష్ట్రంలో ప్రభుత్వాల అవలంబిస్తున్నటువంటి విధానాలపై పోరాటాల్లో నిర్వహించాలని అన్నారు. విద్య ఉపాధికై పోరాటం చేస్తున్నటువంటి డివైఎఫ్ఐ తో కలిసి ముందుకు రావాలని కోరారు కార్యక్రమంలో బానోత్ మధు పవన్ కుమార్ పృధ్విరాజ్ పవన్ తదితరులు పాల్గొన్నారు.



## వేములవాడలో విప్ ఆది శ్రీనివాస్ "చాయ్" చిట్ చాట్

వేములవాడ (ప్రశ్న న్యూస్) హంగూ ఆర్భాటాలు లేకుండా, సాదాసీదా ఎమ్మెల్యేగా, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రజలతో నిత్యం మమేకమై, ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ నియోజకవర్గం శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఆదివారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

పరిశీలనలో భాగంగా, పక్కనే ఉన్న ఓ టీకొట్టు వద్ద ఆగి చాయ్ తాగుతూ కాసేపు ముచ్చటించి,వ్యాపారం ఎలా నడుస్తోంది అని అడిగి తెలుసుకున్నారు. ఈ సహజ దృశ్యం పలు సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొడుతోంది.ప్రజలలో నేరుగా చేరి వారితో కాసేపు స్నేహపూర్వకంగా గడిపిన విప్ ఆది శ్రీనివాస్ ప్రజాసంబంధ నైపుణ్యానికి ఉదాహరణగా నిలుస్తోంది.




# చైనాతో పోరాడిన భారత సైనికుల కథ..

## ఫర్హాన్ అక్తర్ '120 బహదూర్' టీజర్ విడుదల

బాలీవుడ్ నటుడు ఫర్హాన్ అక్తర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం '120 బహదూర్' 1962లో జరిగిన భారత్-చైనా యుద్ధం ఆధారంగా తెరకెక్కుతున్న ఈ మూవీని రజనీష్ (రాజీ ఫేమ్) దర్శకత్వం వహిస్తుండగా.. పరమ వీర చక్ర పురస్కార గ్రహీత మేజర్ సైతాన్ సింగ్ భాటి పాత్రలో ఫర్హాన్ అక్తర్ నటించబోతున్నాడు. రాశీఖన్నా కీలక పాత్రలో నటిస్తుంది. ఈ చిత్రం నవంబర్ 21, 2025న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా సెకండ్ టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. భాగ్ మిల్కా భాగ్ తర్వాత ఫర్హాన్ అక్తర్ మరోసారి బయోపిక్ చేస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.




## 'కాంతార: చాప్టర్ 1' నుంచి 'బ్రహ్మ కలశ' సాంగ్ విడుదల

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కన్నడ చిత్రం 'కాంతార'కు ప్రీక్వెల్‌గా వస్తున్న 'కాంతార: చాప్టర్ 1' నుంచి విడుదలైన ఓ పాట ఇప్పుడు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సినిమా మొదటి భాగంలో క్లైమాక్స్‌లో వచ్చే 'వరాహరూపం' పాట ఎంతటి ఆదరణ పొందిందో తెలిసిందే. అదే తరహాలో, ఈ ప్రీక్వెల్‌లో కూడా శక్తివంతమైన పాటను మేకర్స్ చేర్చారు. తాజాగా విడుదలైన ఈ పాట 'బ్రహ్మ కలశ' పేరుతో శివుడిని భక్తితో ఆరాధించే విధంగా, శక్తిమంతమైన సంగీతంతో ఉంది. ఈ పాట వింటుంటేనే మొదటి భాగంలోని 'వరాహరూపం' పాట ఇచ్చే అనుభూతిని గుర్తు చేస్తోందని అభిమానులు అంటున్నారు. ఈ పాటకు కృష్ణకాంత్ లిరిక్స్ అందించగా.. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందించాడు. అబ్బి వి పాడాడు. రిషబ్ శెట్టి మార్క్ మేకింగ్‌తో, అజనీష్ లోక్‌నాథ్ సంగీతంతో ఈ పాట యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో ఉంది. రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ ప్రాజెక్ట్పై దేశవ్యాప్తంగా అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి.

## టాలీవుడ్‌లో లెనిన్ హవా మొదలైంది..

### అఖిల్ కొత్త అవతారం చూసేందుకు రెడీనా!



అక్కినేని యంగ్ హీరో అఖిల్ ఇప్పుడు తన కెరీర్‌లో మంచి హిట్ కొట్టాలనే కసితో ఉన్నాడు. "ఏజెంట్" మూవీ ఫెయిల్యూర్ తర్వాత పెద్ద సక్సెస్ కోసం వెయిట్ చేస్తున్న అఖిల్, ఇప్పుడు "లెనిన్" పేరుతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా నవంబర్ 17వ తేదీన వరల్డ్ వైడ్‌గా విడుదల కానుంది. ఇప్పటికే షూటింగ్ దాదాపు 80 శాతం పూర్తవగా, మిగిలిన భాగాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని మేకర్స్ ఫిక్స్ అయ్యారు. ఆ వెంటనే పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలవనున్నాయి. త్వరలోనే ఆఫిషియల్ రిలీజ్ డేట్ అనౌన్స్మెంట్ రాబోతుందని టాక్. అంతేకాదు, ప్రమోషన్స్ కూడా అదే సమయంలో మొదలు పెట్టేలా ప్లాన్ చేస్తున్నారు.




## ధన పిశాచి వచ్చేస్తుంది..

సుధీర్ బాబు జటాధర నుంచి సోనాక్షి సిన్హా లుక్ వైరల్

హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా చేసే యాక్టర్లలో ఒకరు టాలీవుడ్ నటుడు సుధీర్ బాబు . ఈ టాలెంటెడ్ యాక్టర్ నటిస్తోన్న సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ జటాధర. వెంకట్ కల్యాణ్ కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ నవంబర్ 7న తెలుగు, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. కాగా మేకర్స్ తాజాగా ఈ మూవీ సాంగ్ అప్‌డేట్ అందించారు.

## దీపావళికి నవ్వుల టపాసులు



'ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందిస్తూ ఓ వైబ్ క్రియేట్ చేయాలనే ఉద్దేశ్యంతో ఈ సినిమా చేశాం. ఈ సినిమాలో నేను జాలీగా లైఫ్‌ను గడిపే బాగా డబ్బున్న యువకుడు కుమార్ పాత్రలో కనిపిస్తా. ఈ సినిమా ప్రతీ ఒక్కరికి కాలేజీ రోజుల్ని గుర్తుకుతెస్తుంది' అన్నారు యువ హీరో కిరణ్ అబ్బవరం. ఆయన నటించిన తాజా చిత్రం 'కె-ర్యాంప్' దీపావళి పర్వదినం సందర్భంగా అక్టోబర్ 18న ప్రేక్షకుల ముందుకురానుంది. జైన్స్ నాని దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రాజేష్ దండ, శివ బొమ్మకు నిర్మించారు.

## సరస్వతిగా వరలక్ష్మి

వరలక్ష్మి శరత్‌కుమార్ తన కెరీర్‌లో మరో అడుగు ముందుకేశారు. స్వీయ దర్శకత్వంలో తన సోదరి పూజా శరత్‌కుమార్‌తో కలిసి ఆమె ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమా పేరు 'సరస్వతి'. శనివారం ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ని విడుదల చేశారు. హై కాన్సెప్ట్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్‌కుమార్ పాత్ర ఊహలకు అందని విధంగా ఉంటుందని, ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో తెలియజేస్తామని మేకర్స్ తెలిపారు. ప్రకాశ్‌రాజ్, ప్రియమణి, నవీన్‌చంద్ర కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ప్రవీణ్ డేనియల్, నిర్మాణం: దోస డైరీస్.





## బాలీవుడ్‌లో బంపరాఫర్

బాలీవుడ్‌లో 'ఫోర్స్' ఫ్రాంచైజీ చిత్రాలు మంచి విజయాలు సాధించాయి. జాన్ అబ్రహం హీరోగా రూపొందిన రెండు భాగాలు ప్రేక్షకాదరణ పొందాయి. ఈ యాక్షన్ థ్రిల్లర్ సిరీస్‌లో మూడో సినిమా రానుంది. భవ్ ధూలియా దర్శకుడు. ఈ చిత్రంలో కథానాయికగా మీనాక్షి చౌదరిని ఖరారు చేశారు. హిందీలో పూర్తిస్థాయి నాయికగా ఆమె నటించబోతున్న తొలిచిత్రమిదే కావడం విశేషం. తెలుగులో హిట్-2, గుంటూరు కారం, లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం చిత్రాలతో మంచి విజయాలు దక్కడంతో కొన్నేళ్లుగా టాలీవుడ్‌లోపైనే దృష్టిపెట్టిందీ భామ.

# అక్రమ వెంచర్ పై జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసిన నాయిని సంతోష్



మంథని( ప్రశ్న న్యూస్) మంథని మున్సిపల్ పరిధిలోని కూచిరాజుపల్లి  లోగల అక్రమ వెంచర్ చేస్తున్నారని నాయని సంతోష్ జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసినారు 27 సర్వే నంబర్ గల భూమి ఆ గ్రామంలోని  నిరుపేదలైన%శ్రీ% దళితులకు ఇవ్వాల్సిన భూమిని అక్రమంగా వెంచర్ రూపంలో పెట్టి కోట్లాది రూపాలు డబ్బులు దన్నుకుంటున్నారని ఈ వెంచర్ పై అధికారులు ఎలా పర్మిషన్ ఇచ్చారని అధికారులపై ప్రజలు మండిపడుతున్నారు సదరు వ్యక్తులు ఈ భూమిని వారి పేరు మీద పట్టాలు చేసుకుని వెంచర్ కోసం డబ్బులకు ఆశపడి అమ్ముకున్నారని వారు వాపోతున్నారు ఇకనుండి అయినా ఇలాంటి వెంచర్లకు పర్మిషన్ ఇవ్వకూడదని సదరు గ్రామంలోని ప్రజలు అధికారులకు విన్నవించుకుంటున్నారు డబ్బులకు ఆశపడి ఇలాంటి నిరుపేదలకు ఇచ్చిన భూమిని గద్దల్ల తన్నుకు పోతున్నారని ప్రజలు రకరకాలుగా చర్చించుకుంటున్నారు

# మంథనిలో పుట్ట మధు హవా...

### ప్రజాసమస్యల పై నిరంతర పోరాటం.
### ప్రజలకు నిత్యం అందుబాటులో .

మంథని( ప్రశ్న న్యూస్) మంథని నియోజకవర్గంలో పుట్ట మధు హవా కొనసాగుతుంది అనడంలో అతిశయోక్తి లేదు. ఎన్ఎస్యుఐ కార్యకర్తగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన పుట్ట మధు అంచలంచెలుగా ఎదిగి ఎమ్మెల్యేగా,  చైర్మన్ గా  పదవులు అధిరోహించాడు. కింది స్థాయి నుంచి ఎదిగిన ప్రజా నాయకుడు , ప్రజా సమస్యలపై అవగాహన కలిగిన వ్యక్తి , నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తి కాబట్టే పుట్ట మధును మంథని నియోజకవర్గంలో ' లీడర్' అంటారు . అదే శ్రీధర్ బాబు రాష్ట్రస్థాయి రాజకీయాలు మాత్రమే చేస్తాడనీ, ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తి కాదని, కనీసం ఫోన్లో కూడా అందుబాటులో ఉండడని , ఆయన గెలుపు కోసం కష్టించి నిజాయితీగా పనిచేసిన వారిని కూడా పట్టించుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. అందుకే ఆయనను రాజకీయ నాయకునిగా చూస్తారని ఏనాటికి లీడర్ కాలేడని అంటున్నారు పొలిటికల్ అనలిస్టులు. మంత్రిగా శ్రీధర్ బాబు మంథని నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ సమస్యలు ఎక్కడికి అక్కడ పెరుగుతున్నాయి కానీ అభివృద్ధి మాత్రం నత్త నడకన కొనసాగుతుందని, తరతరాలుగా వారే మంథనికి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ  ఇంకా మారుమూల మంథని గానే ఉందని, ఈ ప్రాంతం అభివృద్ధిలో వెనుకంజలో ఉందనడంలో సందేహం లేదు. ఇటీవల మంథని లో జరిగిన కొన్ని సంఘటనలు పుట్ట మధుకు మరింత రాజకీయంగా కలిసొచ్చాయి. యూరియా కొరతపై రైతులతో కలిసి పుట్ట మధు చేసిన పోరాటం, కమాన్ పూర్ మండలం లో అంబేద్కర్ విగ్రహాన్ని పుట్ట మధు ప్రారంభించడానికి ముందే కాంగ్రెస్ నాయకులు ప్రారంభించడం ఇరు వర్గాల మధ్య మాటల యుద్ధం కొన సాగింది. మేము మా డబ్బులతో ఏర్పాటు చేసుకున్న అంబేద్కర్ విగ్రహాన్ని మీరు ఎట్లా ఆవిష్కరిస్తారని పుట్ట మధు మంత్రి శ్రీధర్ బాబుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన తండ్రి శ్రీపాద రావు పై పలు ఘాటు విమర్శలు చేశారు. రాజకీయ విమర్శలు తారా స్థాయికి చేరాయి. మరుసటి రోజు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పుట్ట మధు ఇంటిని  ముట్టడించి ధర్నా చేపట్టారు. పుట్ట మధు ఇంట్లో లేకపోవడం ఆయన భార్య పుట్ట శైలజ బయటికి వచ్చి మా ఇంటి ముందు ధర్నా చేస్తుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారంటు ఆగ్రహం వ్యక్తం చేయడంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అక్కడి నుంచి వెళ్లిపోయారు. పుట్ట మధు దమ్ముంటే చౌరస్తా కు రా అంటూ నిరసన చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తల సమూహం నుండి మాటలు రాగానే బయట పరామర్శ కార్యక్రమంలో ఉన్న పుట్ట మధు మంథని చౌరస్తా కు వచ్చి టీ తాగి మరీ వెళ్ళాడు.పుట్ట మధు ను ధైర్యంగా ఎదుర్కొనే దమ్ము కాంగ్రెస్ వాళ్లకు లేదని, దొంగ రాజకీయాలు చేస్తారు అని, నమ్ముకున్న వాళ్ళని నట్టేట ముంచి, గట్టిగా అడిగితే ఇబ్బందులకు గురి చేసే ప్రయత్నాలు చేస్తాడని అటు కాంగ్రెస్ ఇటు బీఆర్ ఎస్ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చర్చించుకుంటున్నారు.అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నేత ఇంటిని ముట్టడించడంపై  అసలు ఎవరు అధికారంలో ఉన్నారు,ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదనీ ఇది సరైన విధానం కాదనీ ప్రజల్లో రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతుంది. పుట్ట మధు ఇంటిని కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలు ముట్టడించడంతో రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ ప్రకంపనలు సృష్టించాయి. బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎక్కడికక్కడ తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తూ మంత్రి శ్రీధర్ బాబు



దిష్టిబొమ్మను కాటారంలో దగ్ధం చేశారు. మంథని లో మంత్రి శ్రీధర్ బాబు చెప్పుడు మాటలు వింటూ అసలు సమస్యలు పట్టించుకోవడం లేదని, రాజకీయాలు మాత్రమే చేస్తాడని ఇక మారడని కాంగ్రెస్ కార్యకర్తల్లో సైతం అసంతృప్తి నెలకొంది. నిన్న హైదరాబాద్ లో నియోజకవర్గ మున్నూరు కాపు నేతల్లో ఇటీవల కాంగ్రెస్ లో చేరిన వారికి గౌరవంగా కుర్చీలో కూర్చోబెట్టి, నమ్ముకున్న వారిని నిలబెట్టాడనీ బాధపడుతున్నారు.

# కండ్లకు గంతలు కట్టుకొని దుర్గా మాత విగ్రహాన్ని తయారు చేసిన శిల్పి

**ఓతి బస్వరాజు**



కాప్రా (ప్రశ్నన్యూస్) మూడు ఫీట్ల పొదవు, గంటాపది నిమిషాల్లోఅమ్మవారి విగ్రకహాన్ని పూర్తి చేసిన శిల్ప కళాకారుడు ఓతి బస్వరాజు. తెలంగాణ ఆస్థిత్వం ప్రపంచంలోనే ప్రత్యేకతను చోటు సంపాదించుకున్న ప్రకృతి పర్వసించే పండుగ పూల పండుగ బతుకమ్మ ను పురస్కరించుకొని, ప్రముఖ శిల్ప కళాకారుడు ఓతి బస్వరాజ్ మేడ్చల్ జల్లా కుషాయిగూడలో కండ్లకు గంతలు కట్టుకొని దుర్గామాత విగ్రహాన్నిరూపొందించాడు, తెలంగాణ సంప్రదాయాలను ఆడపడుచులు, బతుకమ్మ ఆటపాటలతో తొమ్మిది రోజులు తీరొక్క పువ్వులతో, రంగరంగుల పువ్వులు రమనీయంగా అలంకరించి, దుర్గామాత ఆదిశక్తి పరాశక్తి తొమ్మిది రోజులలో తొమ్మిది రూపాల్లో అమ్మ వారు భక్తులకు దర్శనం ఇచ్చి అనుగ్రహిస్తుంది. బతుకమ్మ పండుగతో యావత్ ప్రపంచం అంతా సంబర పడుతుంది, అమ్మవారి దయ,కరుణ చూపు అన్ని వర్గాల ప్రజలపై ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రముఖ శిల్ప కళాకారుడు ఓతి బస్వరాజ్ బతుకమ్మ ఫెస్టివల్ సందర్భంగా కండ్లకు గంతలు కట్టుకొని అమ్మవారి విగ్రహాన్ని తయారు చేయడం అందరిని అబ్బురపర్చింది.

# ఆది కార్తీక్ వినూత్న ఆలోచన

## - "హానర్ టు హ్యుమానిటీ" పేరుతో చిన్నారులకు గౌన్ల పంపిణీ

**- శాలువాలతో ఉపాధి - చిన్నారులకు ఆనందం - కార్తీక్ సేవా స్ఫూర్తి అభినందనీయం**

**- ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్**

వేములవాడ (ప్రశ్న న్యూస్) రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కుమారుడు ఆది కార్తీక్ వినూత్న ఆలోచనతో వేములవాడలో వినూత్న సేవా కార్యక్రమం ప్రారంభమైంది. ఎమ్మెల్యేకు వివిధ సందర్భాల్లో అందిన శాలువలను "హానర్ టు హ్యుమానిటీ" పేరుతో చిన్నారుల గౌన్లుగా కుట్టించి పంపిణీ చేశారు. ఆదివారం పట్టణంలోని పలు కాలనీల్లో చిన్నారులకు గౌన్లు అందజేస్తూ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ –" వేములవాడ ఎమ్మెల్యే గా నేను గెలిచిన నాటి



నుండి నాకు వచ్చిన శాలువాలను సేవాభావంతో గౌన్లుగా మార్చి పంపిణీ చేయడం సంతోషంగా ఉంది. ఈ ఆలోచనకు శ్రీకారం చుట్టిన నా కుమారుడు ఆది కార్తీక్ను అభినందిస్తున్నాను. శాలువాలు వినియోగంలోకి రావడం మాత్రమే కాదు, ఈ



క్రమంలో కొందరికి ఉపాధి అవకాశాలు కూడా కలుగుతున్నాయి" అని తెలిపారు.స్థానికంగా ఈ కార్యక్రమం పలువురి ప్రశంసలు అందుకుంది.

# జోగినిపల్లి సంతోష్ పర్యావరణ చైతన్యానికి నిదర్శనంగా నీలోజిపల్లి జమ్మిచెట్టు

**- నాడు నాటిన జమ్మి మొక్క - నేడు జమ్మి వృక్షంగా**

**- పర్యావరణ పరిరక్షణ లో జోగినిపల్లి సంతోష్ స్ఫూర్తి హర్షణీయం - కృతజ్ఞతలు**

**- బీఆర్ఎస్ పార్టీ జిల్లా నేత : అనుముల భాస్కర్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామంలో 2021లో "గ్రీన్ ఇండియా ఛాలెంజ్"లో భాగంగా మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన "ఊరు ఊరికో జమ్మిచెట్టు – గుడి గుడికో జమ్మిచెట్టు" కార్యక్రమంలో నాటిన జమ్మి మొక్క నేడు పెద్ద వృక్షంగా మారింది.దసరా పండుగ సందర్భంగా గ్రామ ప్రజలు ఈ జమ్మి చెట్టుకు పూజలు నిర్వహిస్తూ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.  ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా నిలిచిందని, పర్యావరణ పరిరక్షణలో జోగినిపల్లి సంతోష్ కుమార్ స్ఫూర్తి హర్షణీయమని, ఈ సందర్భంగా జోగినిపల్లి సంతోష్ కుమార్ కు గ్రామ ప్రజల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకులు అనుముల భాస్కర్ పేర్కొన్నారు.

# శివపార్వతుల కళ్యాణ మహోత్సవంలో పాల్గొని అన్నసంతర్పణ నిర్వహించిన బండారి గంగాధర్

**ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి**

మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) శివపార్వతుల కళ్యాణ మహోత్సవంలో పాల్గొని అన్నదాన కార్యక్రమం నిర్వహించిన ప్రముఖ సంఘ సేవకులు కాంగ్రెస్ నాయకులు బండారి సంతోష గంగాధర్ ఈ కళ్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథిగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సువాసిని రెడ్డి.  మెదక్ జిల్లా శివంపేట్ మండల్ పిల్లుట్ల గ్రామంలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 7వ రోజు దుర్గాదేవిగా దర్శనం ఇవ్వడం జరిగింది అలాగే శివపార్వతుల కళ్యాణ మహోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రముఖ సంఘ సేవకులు బండారి సంతోష గంగాధర్ గారు. నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ చిలుముల సువాసిని రెడ్డి దుర్గ భవాని అమ్మవారిని దర్శనం చేసుకుని శివ పార్వతుల కళ్యాణ కార్యక్రమంలో పాల్గొని అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండారి కిష్టయ్య . బండారి ముత్యాలు. బండారి నగేష్. గాండ్ల కిష్టయ్య. బండారి సాయి కిరణ్. బి జె ఆర్ యువసేన అధ్యక్షులు కుమ్మరి నాగరాజు. పిల్లి నరేష్. ఆలయ కమిటీ చైర్మన్ పిల్లి శివకుమార్. బోను లింగం భవాని ఉత్సవ కమిటీ సభ్యులు. కమ్మరి నరేందర్. బొంది శ్రీనివాస్ గౌడ్. భవాని ఉత్సవ కమిటీ చైర్మన్ గురాల ఆంజనేయులు. మాజీ సర్పంచ్ పెదపులి రవి. పిల్లి మణికంఠ. భవాని ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించినటువంటి ప్రముఖ సంఘ సేవకులు బండారి సంతోష గంగాధర్ ఘనంగా సన్మానం చేయడం జరిగింది.

అలాగే అమ్మవారి ఆశీస్సులు మీ కుటుంబం పైన మీపైన ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# కేంద్రమంత్రి బండి సంజయ్ కి దసరా శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు సంటి మహేష్

**- మహేష్ కు కేంద్రమంత్రి అంభినందనలు - సూచనలు**




వేములవాడ (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు సంటి మహేష్ ఆదివారం కరీంనగర్లోని మహాశక్తి ఆలయంలో కేంద్ర హొంశాఖ సహాయ మంత్రి ,కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ను మర్యాదపూర్వకంగా కలిశారు.



ఈ సందర్భంగా సంటి మహేష్ కేంద్రమంత్రికి బతుకమ్మ, దసరా పండుగల శుభాకాంక్షలు తెలియజేస్తూ,నిత్యం ప్రజా సేవలో నిమగ్నమవుతూ దేశాభివృద్ధికి పాటుపడటంలో దుర్గాదేవి దివ్యాశీస్సులతో సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. "అమ్మవారి కృపతో ప్రజలందరూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉత్సాహంగా పండుగలను జరుపుకోవాలి" అని ఆయన పేర్కొన్నారు.అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ సంటి మహేష్ కు కండువా కప్పి అభినందిస్తూ, రాబోయే దసరా వేడుకలు ప్రశాంతంగా, సజావుగా జరుగే విధంగా స్థానిక బిజెపి నాయకులు నిరంతరం పర్యవేక్షించాల్సిందిగా సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ గొప్ప దేశభక్తుడు

**బజరంగ్ సేన రాష్ట అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బ్రిటీష్ వలసవాదులకు వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి, చిరునవ్వుతో ఉరి కంబాన్ని ముద్దాడిన భగత్ సింగ్ నిజమైన గొప్ప దేశభక్తుడని బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు అన్నారు. ఆదివారం భగత్ సింగ్ 118వ జయంతిని పురస్కరించుకుని పలువురు నేతలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.భగత్ సింగ్ స్ఫూర్తితో సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ఉద్యమించి దేశ వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు.

దేశం కోసం అసమాన త్యాగాలు చేసిన భగత్ సింగ్ ఆశయాలను విద్యార్థులు, యువత స్ఫూర్తిగా తీసుకొని దేశాన్ని సామ్రాజ్యావాదులు, కార్పొరేట్ సంస్థల నుండి రక్షించాలని కోరారు. భారత దేశ అత్యున్నత పురస్కారం అయిన భారతరత్నను భగత్ సింగ్ కు  ప్రదానం చేయడం ద్వారా భగత్ సింగ్ దేశానికి చేసిన అమూల్యమైన సహకారాన్ని గుర్తించాలని లక్ష్మణ్ రావు భారత ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శివసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎ.సుదర్శన్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు గౌట్ గణేష్, దత్తు పటేల్, దత్తాత్రేయ, మన్ను సింగ్, నన్ను సింగ్, దత్తా దాపురంగ్, గురు దయాల్ సింగ్, మహేష్ గౌడ్, అనిల్ కుమార్, విజయ్ గోవింద్ సింగ్. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# యువత ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి

**భగత్ సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం**

**గూడూరులో ఘనంగా భగత్ సింగ్ 118వ జయంతి వేడుకలు**




గూడూరు (ప్రశ్న న్యూస్) స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ భగత్ సింగ్ ఆశయాలను ముందుకు తీసుకువెళదామని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి. శశి కుమార్, ఇన్సాఫ్ రాష్ట్ర ఉప కార్యదర్శి షేక్ జమాలుల్లా, ఏఐవైఎఫ్ నాయకులు ఎం. సునీల్ యువతకు పిలుపునిచ్చారు. ఆదివారం గూడూరు సీపీఐ కార్యాలయంలో స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ భగత్ సింగ్ 118వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. షహిద్ సర్దార్ భగత్ సింగ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత దేశంలో వాస్తవ పరిస్థితులను అవగాహన చేసుకోవాలన్నారు.  కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. అన్యాయం, అక్రమాలపై ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు.  భగత్ సింగ్ యువతలో చైతన్యాన్ని కోరుకున్నారని ఆయన త్యాగాలను వివరించారు. యువత భగత్ సింగ్ ఆశయాలకు అనుగుణంగా దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం భగత్ సింగ్ చిత్ర పటానికి నివాళులర్పించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి. శశి కుమార్, ఇన్సాఫ్ రాష్ట్ర ఉప కార్యదర్శి షేక్  జమాలుల్లా, జిల్లా ఉపాధ్యక్షులు చల్లా వెంకటేశ్వర్లు,  ఏఐవైఎఫ్ నాయకులు ఎం. సునీల్, మాజీ నాయకుడు వెంకటేష్, జిల్లా సహాయ కార్యదర్శి నాగార్జున, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు యస్వంత్, మోహన్, దుర్గ, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఈ పాపం ఎవరిది.?

## - తొక్కిసలాట వెనుక డీఎంకే కుట్ర.?

- నటుడు విజయ్ కరూర్ ర్యాలీలో ఘోర విషాదం
- తొక్కిసలాటపై మద్రాసు హైకోర్టులో పిటిషన్
- కరూర్ డీఎంకే నాయకులపై అనుమానం
- విజయ్ పార్టీ సంచలన ఆరోపణలు

**చెన్నై (ప్రశ్న న్యూస్)** తమిళనాడులో టీవీకే అధినేత, నటుడు విజయ్ ర్యాలీలో శనివారం రాత్రి తొక్కిసలాట చోటుచేసుకుని, 40 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 100 మందికిపైగా గాయపడ్డారు. అయితే, ఈ ఘటన వెనుక డీఎంకే కుట్ర ఉందని టీవీకే సంచలన ఆరోపణలు చేసింది. దీనిపై సీబీఐతో విచారణ జరిపించాలని మద్రాసు హైకోర్టులో ఈ మేరకు పిటిషన్ వేసింది. ఆ పార్టీ తరపున పిటిషన్ వేసిన లాయర్ అరివఝగన్ మాట్లాడుతూ తొక్కిసలాట ఘటనపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) లేదా సీబీఐకి బదిలీ చేయాలని కోరినట్టు తెలిపారు. కరూర్ ర్యాలీలో భద్రతా నిబంధనలను ఉల్లంఘించారనే ప్రభుత్వ ఆరోపణలను అతడు తోసిపుచ్చాడు. సోమవారం మద్రాసు హైకోర్టు విచారణ సమయంలో ఈ అంశాలను లేవనెత్తుతామని చెప్పారు. "కరూర్ దుర్ఘటన వెనుక కుట్ర ఉంది, కాబట్టి గౌరవనీయమైన ఉన్నత న్యాయస్థానం దీనిపై స్వతంత్ర విచారణ జరిపించాలి కోర్టు సిట్‌ను వేయడం లేదా తమిళనాడు పోలీసుల నుంచి సీబీఐకి అప్పగించాలి' అని డిమాండ్ చేశారు. తమిళనాడు పోలీసుల విచారణపై నమ్మకం లేదా? అని ప్రశ్నించగా 'క్రిమినల్ కుట్ర ఉంది, స్థానికులు నుంచి దీనిపై మాకు నమ్మదగిన సమాచారం, సీసీటీవీ ఫుటేజ్‌లు ఉన్నాయి. కరూర్ జిల్లాల్లోని అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులకు ఈ కుట్రతో సంబంధం ఉందనడానికి ఆధారాలు ఉన్నాయి" అని ఆరోపించారు. కరూర్ తొక్కిసలాటలో చిన్నారులు, మహిళలు సైతం ప్రాణాలు కోల్పోవడం బాధాకరం.పోలీసుల మార్గదర్శకాలను ఉల్లఘించారనే ప్రభుత్వ ఆరోపణలకు కౌంటర్ ఇచ్చిన అరివఝగన్, మేము ఎటువంటి



ఉల్లంఘనలకు పాల్పడలేదని స్పష్టం చేశారు. 'గత కొద్ది నెలలుగా టీవీకే మదురై, తిరుచ్చి, అరియలూర్, తిరువరూర్, నాగపట్టణం, నమక్కల్‌లో అనేక కార్యక్రమాలు నిర్వహించింది, మరి కరూర్‌లోనే ఎందుకు ఇలా జరిగిందనేది మా ప్రశ్న, అనేక సందేహాలు కలుగుతున్నాయి' అని వ్యాఖ్యానించారు. కుట్ర సిద్ధాంతంపై డీఎంకే స్పందించింది. ఆ పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ సయ్యద్ హాఫీజుల్లా 'దీనిని మేము రాజకీయం చేయాలనుకోవడం లేదు, చట్టం తన పని తాను చేసుకుపోతుంది ఇటువంటి ఆరోపణలు చేసేవారు ముందు తమ పార్టీ



నాయకత్వం ఎలా ప్రవర్తించిందో ఆత్మపరిశీలన చేసుకోవాలి' అని బదులిచ్చారు. ఇక, రాష్ట్ర ప్రభుత్వ వర్గాల ప్రకారం కరూర్‌లో విజయ ర్యాలీ జరిగే ప్రదేశానికి మధ్యాహ్నం నుంచే జనం చేరుకున్నారు. కానీ, ఆయన రాక ఆలస్య కావడం, సామర్థ్యానికి మించి జనం హాజరయ్యారు. ఈ జాప్యం ఉద్దేశపూర్వకంగా జరిగిందని, టీవీకే నాయకులు జనసమూహం పెరగాలని కోరుకున్నారని ఆ వర్గాలు పేర్కొన్నాయి. కానీ, ఈ ఆరోపణల్లో నిజం లేదని టీవీకే పార్టీ వర్గాలు పేర్కొనడం గమనార్హం.

# చైనాలో మాజీ మంత్రికి మరణశిక్ష

- రూ.334 కోట్ల అవినీతికి పాల్పడినట్లు తేల్చిన కోర్టు
- విచారణకు సహకరించడంతో రెండేళ్ల పాటు శిక్ష అమలు వాయిదా
- రాజకీయాల్లో పాల్గొనకుండా జీవితకాలం నిషేధం
- అక్రమ ఆస్తులన్నీ జప్తు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం



బీజింగ్ (ప్రశ్న న్యూస్) అవినీతిపై ఉక్కుపాదం మోపుతున్న చైనా ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. దేశ మాజీ వ్యవసాయ శాఖ మంత్రి టాంగ్ రెన్‌జియాన్‌కు మరణశిక్ష విధిస్తూ జిలిన్ ప్రావిన్స్ న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. సుమారు రూ.334 కోట్ల విలువైన లంచాలు స్వీకరించినట్లు ఆయనపై ఆరోపణలు రుజువు కావడంతో ఈ కఠిన శిక్షను ఖరారు చేసింది. అయితే, విచారణకు పూర్తిగా సహకరించినందున శిక్ష అమలును రెండేళ్ల పాటు వాయిదా వేస్తున్నట్లు కోర్టు తన తీర్పులో పేర్కొంది. వివరాల్లోకి వెళితే, టాంగ్ రెన్‌జియాన్ 2007 నుంచి 2024 మధ్య కాలంలో పలు ప్రభుత్వ ఉన్నత పదవుల్లో పనిచేశారు. ఈ సమయంలో ఆయన తన అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లు తేలింది. వ్యాపార సంస్థలకు అనుకూలంగా వ్యవహరించడం, కాంట్రాక్టులు ఇప్పించడం, ఉద్యోగ నియామకాలు జరపడం వంటి పనుల కోసం భారీ మొత్తంలో లంచాలు స్వీకరించినట్లు కోర్టు నిర్ధారించింది. మొత్తం 268 మిలియన్ యువాన్ల (భారత కరెన్సీలో సుమారు రూ.334 కోట్లు) విలువైన నగదు, ఆస్తులు, ఇతర విలువైన వస్తువులను ఆయన లంచాల రూపంలో తీసుకున్నట్లు విచారణలో వెల్లడైంది. విచారణ సమయంలో టాంగ్ తన నేరాలన్నింటినీ అంగీకరించారు. మరణశిక్షతో పాటు, టాంగ్ రెన్‌జియాన్‌పై మరిన్ని కఠిన చర్యలకు కోర్టు ఆదేశించింది. ఆయన రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనకుండా జీవితకాలం నిషేధం విధించింది. ఆయన వ్యక్తిగత ఆస్తులన్నింటినీ పూర్తిగా జప్తు చేయాలని, అవినీతి ద్వారా సంపాదించిన సొమ్మును ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని స్పష్టం చేసింది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ 2012లో అధికారం చేపట్టినప్పటి నుంచి అవినీతి నిర్మూలనే లక్ష్యంగా కఠిన చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. చిన్న స్థాయి ఉద్యోగుల నుంచి అత్యున్నత స్థాయి అధికారుల వరకు అవినీతికి పాల్పడిన ఎవరినీ వదిలిపెట్టడం లేదు. టాంగ్ రెన్‌జియాన్‌పై తీసుకున్న ఈ చర్య కూడా ఆ పోరాటంలో భాగమేనని అక్కడి మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ తీర్పు చైనాలో అవినీతికి పాల్పడే వారికి గట్టి హెచ్చరికగా నిలుస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# చీపురి చాటున చాకిరి దోపిడీ

## - బోయిన్ పల్లి ఏఎంసీ కాంట్రాక్టర్ల ఘనకార్యం

- పేదల శ్రమను అడ్డంగా దోస్తూ, సెక్ రాగానే బక్కచిక్కిన బ్రతుకులకు టోకర కొడుతున్న కన్నింగ్ గాండ్లు
- గత రెండు పర్యాయాలుగా బోయిన్ పల్లి మార్కెట్లో గార్బేజ్ కాంట్రాక్టు సొంతం చేసుకుని, స్వీపర్స్ బకాయిలకు ఎగనామం
- ఆరున్నర దశాబ్దాల వయస్సులో పని,అవ్వల అమాయకత్వాన్ని చూసి కాజేస్తున్న నెల వేతనాలు, లక్షల జీతాలు పెండింగ్లో ఉన్న కాంట్రాక్టర్ పై అధికారులు చర్యలు శూన్యం
- ఫ్యామిలీలో పరిషాన్, మార్కెట్లో కర్మచారిల మనీ కిరికిరి,కైస జీన భగవాన్ అంటూ నిత్యం కన్నీళ్లు తుడిచుకుంటూ రోడ్లు శుభ్రం చేస్తున్న మహిళా మణులు

**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** పేదల జీవితాల్లో వెలుగులు నింపే ప్రభుత్వాలను చూశాం. సంక్షమాల పేరుతో ప్రజలకు వరాల జల్లులు కురిపించే నాయకులను చూస్తుంటాం! రాష్ట్ర విడిపోయి పేద మధ్యతరగతి కుటుంబాల్లో వెలుగులు విరజిమ్మే నవ్వులతో ఆకాశాన్ని తాకే ఆనందం మిగులుతుందని ఆశించిన వారి జీవితాల్లో కష్టాలు కెరటాలు వెక్కిరిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర 2014 జూన్ రెండో తారీఖున ఏర్పడింది. మొదట ఐదేళ్ళపాటు సంక్షేమం, అభివృద్ధి పై భారీ స్థాయిలో పాలకులు ఫోకస్ చేశారు. వీరి పరిపాలన చూసి తెలంగాణ రాష్ట్ర ప్రజలు రెండో సారి అధికారాన్ని కట్టబెట్టారు. కానీ ప్రభుత్వం మాత్రం వివిధ శాఖల్లో రకరకాల టెండర్లు సొంతం చేసుకుని నిధులు మంజూరు కాక,అలాగే పొరుగు సేవలు అందిస్తున్న ఉద్యోగులు పెడుతున్న శాపనార్థాలకు గురైనట్లు సమాచారం ? ఈ నేపథ్యంలో పలు శాఖల్లో కొంతమంది కాంట్రాక్టర్లు హౌట్ సొర్సింగ్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వక చెతులు ఎత్తేసిన దాఖలాలు లేకపోలేదు. ప్రస్తుతం ఈ ప్రభుత్వంలోనైన న్యాయం జరగకపోతుందనని కాళ్ల చొప్పులు అరగేటట్లు ఫైనాన్స్ డిపార్ట్మెంట్ చూట్టూ ప్రదక్షనలు చేస్తున్న కమీషన్ల కకృతికి ఫైల్ ముందుకు సాగడం లేదు ? ఈ నేపథ్యంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖలో కాంట్రాక్టుల ఇబ్బందులు వర్ణనాతీతం. ఒక పక్క బిల్లులు రాక హౌట్ సొర్సింగ్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేక ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుంటున్నారు. ఇక కొంతమంది అయితే ఏకంగా అమాయకులు అయిన పొరుగు సేవలు అందించే ఉద్యోగులకు కుచ్చు టోపీ పెడుతున్నారు.

### - బోయిన్ పల్లి మార్కెట్ లో కార్మికుల కన్నీళ్లు..

డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో కాంట్రాక్టర్ల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతున్నాయి. 2023-24 సంవత్సరమున గార్బేజ్ కాంట్రాక్టర్ ధర్మారెడ్డి టెండర్ కైవసం చేసుకున్నారు. సదరు కాంట్రాక్టర్ కి మార్కెట్ విధి విధానాలు తెలియక, తీరిక లేక సబ్ కాంట్రాక్టర్ కి అప్పజేప్పారు చెత్త కాంట్రాక్టు. బోయిన్ పల్లి మార్కెట్ లో గార్బేజ్ కాంట్రాక్టు సొంతం చేసుకున్న తర్వాత మార్కెట్లో చెత్త చెదారం తొలగిస్తూ అలాగే ప్రతి రోజూ సగటున చెడిపోయిన టన్ను కూరగాయలు బయో గ్యాస్ కేంద్రానికి తరలించాలి,లేని పక్షంలో మార్కెట్ కమిటీ నియమ నిబంధనల ప్రకారం సదరు కాంట్రాక్టర్ పై రోజుకి వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తారు. ఏడాది కాలంలో సుమారు ఆరు నుంచి ఏడు నెలల కాంట్రాక్టర్ కి తప్పని తిప్పలు మార్కెట్లో ఎదురౌతాయి. ఎందుకంటే మార్కెట్ వచ్చే కూరగాయలు చెడి పోవు కొన్ని మాత్రమే నాసిరకం,పాచి పోయినవి ముఖ్యంగా ఎండ కాలం, చలికాలం మార్కెట్ కి దిగుమతి అయిన కూరగాయలు పూర్తి స్థాయిలో అమ్మకాలు జోరుగా సాగుతోంది.ఏదేమైన కాంట్రాక్టర్లు,అధికారులు తెలివిగా వ్యవహరిస్తూ ముందుకు సాగుతారు. అయితే సదరు కాంట్రాక్టర్ టెండర్ సొంతం చేసుకున్నప్పుడు నెల అడ్వాన్స్ మార్కెట్ అధికారుల వద్ద జమా చేస్తారు. అనివార్య కారణాల వల్ల కాంట్రాక్టర్ ఏమైనా సమస్యలు సృష్టిస్తే వారి డిపాజిట్ ఫోర్ ఫిట్ అయిపోతుంది. అయితే సదరు కాంట్రాక్టర్ ధర్మారెడ్డి ఆయన పేరులో ధర్మం ఉంది, కానీ ఆయన మాత్రం అధర్మంతో అమాయకులైన చెత్త కార్మికుల రెండు నెలల జీతాలకు ఎగనామం పెట్టాడు. ఒకడు పోయాడు అంటే మరొకడు కూడా అదే దారిలో వచ్చాడు, మూడు నెలల జీతాలు ఇవ్వలేదని కన్నీటి పర్యంతమయ్యారు ఆరుమంది మహిళ కార్మికులు. ఇలాంటి వాళ్లని మార్కెటింగ్ డైరెక్టర్ అధికారులు బ్లాక్ లీస్టులో పెట్టాల్సిన బాధ్యతను విస్మరించి గత కొన్ని రోజుల క్రితం గార్బేజ్ టెండర్ ప్రక్రియలో పాల్గొన్న కూడా చూసి చూడనట్లు వ్యవహరించడం నిజంగా దురదృష్టకరం.

### - కాంట్రాక్టర్ల శాపం, దసరాకి దూరం, 8 మంది కార్మికుల ఆవేదన



బోయిన్ పల్లి మార్కెట్ లో గత కొన్ని సంవత్సరాలుగా చెత్త కార్మికులుగా సేవలందిస్తున్న ఆరున్నర దశాబ్దాల వయస్సు ఉన్న మహిళ మణులు. ఆర్థికంగా చితకబడిన కుటుంబాల తల్లీలు గచ్ఛేంత్రం లేక బోయిన్ పల్లి మార్కెట్ లో కర్మచారులుగ(సఫాయి వాలా) విధులు నిర్వహిస్తున్నారు. మార్కెట్ విస్తీర్ణం 21 ఎకరాల 23 గుంటలు. అష్టదిగపాలకులు లాగ అన్ని వైపుల నుంచి ఉదయం పది గంటలకు విధుల్లోకి వచ్చి రాత్రి ఏడు గంటల వరకు సేవలందిస్తున్నారు. సగటున ప్రతి రోజు బోయిన్ పల్లి మార్కెట్ కి ఇరవై ఏడు టన్నుల కూరగాయలు దిగుమతి అవుతున్నాయి. ఇంత పెద్ద మార్కెట్లో కేవలం ఎనిమిది మంది కార్మికులు క్లీన్ అండ్ గ్రీన్ గా పెట్టడానికి అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఏ పాపం తెలియని ఈ అమాయకపు బక్కచిక్కిన బతుకులతో కొంతమంది కాంట్రాక్టర్లు వారి జీవితాలతో చెలగాటం ఆడటం సరైన విధానం కాదంటున్నారు కార్మిక సంఘాలు.బోయిన్ పల్లి మార్కెట్లో కాంట్రాక్టర్లు వస్తుంటారు,పోతుంటారు. కానీ ఈ ఎనిమిది మంది కార్మికులకి మరో పని తెలియక ఒంట్లో బలం, ఊపిరి ఉన్నంత కాలం మార్కెట్లో సేవలు అందిస్తామని గర్వంగా తెలియజేశారు. ఇలాంటి అమాయకుల శ్రమ దొచేస్తున్న బడా కాంట్రాక్టర్ల బడతం పట్టాల్సిన మార్కెట్ అధికారులు, కమిటీ పెద్దలు చర్యలు ఏవిధంగా ఉంటాయో ఎదురు చూడాల్సిందే! ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికులకు మానవ దృక్పథంతో సహాయం చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే అభం శుభం తెలియని చెత్త కార్మికులు ఆర్థిక ఇబ్బందులు కారణంగా దసర పర్వదినానికి దూరంగా ఉంటున్నట్లు సమాచారం.?




### - అసలు గుట్టు పెరుమాళ్ కే తెలుసు



డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో టెండర్ ప్రక్రియలో పలు అనుమానాలు ? గతంలో నాలుగు లక్షల పైచిలుకుకి టెండర్ సొంతం చేసుకున్నారు.సదరు కాంట్రాక్టర్ నాలుగు లక్షల ఇరవై వేల పైచిలుకుకి ఎనిమిది మంది కార్మికులతో మార్కెట్లో సేవలు అందించారు. వారే గత కొన్నేళ్లుగా మార్కెట్లో పనులు చేస్తున్నారు.అయితే కొన్ని రోజుల క్రితం టెండర్లో పాల్గొన్న వారు గతం లాగా నాలుగు లక్షల పైచిలుకు కి కాకుండా ఈ సారి ఏకంగా ఆరు నుంచి ఏడు లక్షల వరకు టెండర్ వేసి నట్లు సమాచారం.అయితే మార్కెట్ అధికారులు ఆరు లక్షల పైచిలుకు వేసిన కాంట్రాక్టర్ కే ఖరారు చేశారు. సొంతం చేసుకున్న కాంట్రాక్టర్ ఏమైనా స్పెషల్ గా సేవలు అందిస్తారా అంటే అదేమీ లేదు. ఎందుకంటే అదే ఎనిమిది మంది కార్మికులు, అదే 21 ఎకరాల 23 గుంటల విస్తీర్ణంలో ఉన్న మార్కెట్. కొత్తగా ఈయన చేసేది ఏం ఉందో అర్థం కావడం లేదని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నారు. 2 లక్షల రూపాయలు అధికంగా వెచ్చించాల్సిన అవసరం ఏం ఉందని టెండర్లో పాల్గొన్న వ్యక్తులు నిలదీస్తున్నారు. మరో విషయం ఏమిటంటే బోయిన్ పల్లి మార్కెట్ అధికారులు మార్కెటింగ్ డైరెక్టర్ అధికారుల సూచనలతో కొత్త కాంట్రాక్టర్కి ఈ నెల 17 వ తేదీ నుంచి బాధ్యతలు అప్పగించారు. గడిచిన పది రోజుల్లో కిశోర్ అనే నూతన కాంట్రాక్టర్ పాత వాళ్ళైనా ఎనిమిది మంది కార్మికులను విధుల్లోకి తీసుకుని మార్కెట్లో సేవలందిస్తున్నారు. ఆ ధర్మారెడ్డి ధర్మాన్ని వీడడు. ఈకిశోర్ కార్మికుల కష్టాలను దూరం చేస్తాడా లేదా మరిన్ని సమస్యలు సృష్టిస్తాడా కాలమే సమాధానం చెప్పాలి.

### - కమిటీ ఛైర్మన్ వివరణ..

బోయిన్ పల్లి మార్కెట్లో ఎవ్వరైనా వ్యవసాయ, మార్కెటింగ్ శాఖకు చెందిన నియమ నిబంధనలకు లోబడి వ్యాపార లావాదేవీలు నిర్వహించాలి,రూల్స్ అందరికి వర్తిస్తాయి. ఒకవేళ ఎవ్వరైనా అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాగిరి ఆనంద్ బాబు. అదిగాక గార్బేజ్ కాంట్రాక్టర్లు చెత్త కార్మికులకు వేతనాలు ఎగగొట్టారన్న విషయం వాస్తవమే,కాంట్రాక్టర్లకు చెందిన డిపాజిట్లు ఇవ్వకుండా ఆపాలని,చెత్త కార్మికుల సమస్య పరిష్కరించిన తర్వాతే వారికి చెందిన చెక్ లను విడుదల చేయాలని అధికారులకు సూచించానని కమిటీ ఛైర్మన్ రాగిరి ఆనంద్ బాబు తెలిపారు. మార్కెట్లో ఎవ్వరికైనా అన్యాయం జరిగితే ఉరుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

# కరెంట్ బిల్లులే లేవు, పైగా నెలనెలా ఆదాయం


- దక్షిణ భారతదేశంలోనే తొలి సోలార్ గ్రామంగా సీఎం రేవంత్ సొంతూరు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత గ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి ఇప్పుడు విద్యుత్ విషయంలో స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా, యావత్ దక్షిణ భారతదేశంలోనే తొలి సంపూర్ణ సౌర గ్రామంగా రికార్డు సృష్టించింది. ఈ ఘనత సాధించిన రెండో భారతీయ గ్రామంగా కూడా నిలిచింది. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన హరిత ఇంధన పథకంలో భాగంగా ఈ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేశారు. గ్రామంలోని 514 ఇళ్లు, 11 ప్రభుత్వ భవనాలకు సౌర ఫలకాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే 480 ఇళ్లపై 3 కిలోవాట్ల సామర్థ్యం గల రూఫ్‌టాప్ ప్యానెళ్లను, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలపై 60 కిలోవాట్ల సోలార్ యూనిట్లను బిగించారు. ప్రతి ఇంటికి నెలకు 360 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుండటంతో, గ్రామస్థులకు నిరంతరాయ విద్యుత్‌తో పాటు నెలవారీ బిల్లుల భారం పూర్తిగా తప్పిపోయింది.ఈ ప్రాజెక్టు ప్రత్యేకత కేవలం విద్యుత్ స్వయం సమృద్ధితోనే ఆగిపోలేదు. గ్రామ అవసరాలు తీరగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేస్తూ గ్రామస్థులు ఆదాయం కూడా పొందుతున్నారు. యూనిట్‌కు రూ. 5.25 చొప్పున అమ్ముతూ, కేవలం సెప్టెంబర్ నెలలోనే లక్ష యూనిట్ల విద్యుత్‌ను విక్రయించి దాదాపు రూ. 5 లక్షలు సంపాదించారు. దీంతో గ్రామస్థులు హరిత పారిశ్రామికవేత్తలుగా మారారని అధికారులు చెబుతున్నారు. మొత్తం రూ. 10.53 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీరెడ్కో) పూర్తి చేసింది. దీనికి కేంద్ర ప్రభుత్వం రూ. 3.56 కోట్ల సబ్సిడీ అందించగా, ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ సీఎస్ఆర్ నిధుల కింద రూ. 4.09 కోట్లు సమకూర్చింది. మౌలిక వసతుల కోసం మరో రూ. 2.59 కోట్లు ఖర్చు చేశారు. ప్రభుత్వ దార్శనికత, కార్పొరేట్ మద్దతు, ప్రజా భాగస్వామ్యంతో గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి అద్భుతాలు సృష్టించవచ్చో కొండారెడ్డిపల్లి నిరూపిస్తోందని అధికారులు పేర్కొంటున్నారు. ఇది కర్బన ఉద్గారాలను తగ్గించి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేసే దిశగా ఒక చారిత్రక మైలురాయి అని వారు అభివర్ణించారు.

# ఆసియా కప్ విజేత భారత్

- ఫైనల్లో పాకిస్థాన్ చిత్తు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఆసియాకప్ 2025 విజేతగా భారత్ నిలిచింది. ఫైనల్‌లో పాకిస్థాన్‌ను 6 వికెట్ల తేడాతో ఓడించి 9వ సారి ఆసియాకప్ టైటిల్‌ను ముద్దాడింది. చివరి ఓవర్ వరకు ఉత్కంఠ భరితంగా సాగిన లో స్కోరింగ్ మ్యాచ్‌లో టీమిండియా విజయ ఢంకా మోగించింది. తొలుత పాకిస్థాన్‌ను 146 పరుగులకు ఆలౌట్ చేసిన భారత్.. ఆ తర్వాత మరో బంతి మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. ఓ దశలో 20 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన భారత్‌ను తిలక్ వర్మ వీరోచిత పోరాటంతో గెలుపు గీత దాటించాడు. పాక్ నిర్దేశించిన 147 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ తీవ్రంగా తడబడింది. సూపర్ ఫామ్‌లో ఉన్న అభిషేక్ శర్మ (5) రెండో ఓవర్‌లోనే ఔట్ అయ్యాడు. తర్వాతి ఓవర్‌లోనే సూర్యకుమార్ యాదవ్ (1) కాసేపటికే గిల్ (12) కూడా ఔట్ అయ్యారు. దీంతో భారత్ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ సమయంలో మరో వికెట్ పడితే పరిస్థితి వేరుగా ఉండేది.కానీ క్లిష్ట సమయంలో క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ సత్తా చాటాడు. తీవ్ర ఒత్తిడిని అధిగమించి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అతడికి సంజూ శాంసన్ (21 బంతుల్లో 24 రన్స్) సహకరించాడు. అతడు ఔట్ అయిన తర్వాత శివమ్ దూబె (22 బంతుల్లో 33 రన్స్) కూడా సత్తాచాటాడు. చివరి వరకూ క్రీజులో ఉన్న తిలక్ వర్మ 53 బంతుల్లో 69 రన్స్ చేసి అజేయంగా నిలిచాడు. దీంతో టీమిండియా మరో రెండు బంతులు మిగిలి ఉండగానే 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 19వ ఓవర్ చివరి బంతికి సిక్స్ కొట్టబోయిన దూబే క్యాచ్ ఔట్ కాగా ఆఖరి ఓవర్లో భారీ షాట్ బాదిన తిలక్ భారత్‌కు విజయాన్ని ఖాయం చేశాడు.ఈ విజయంతో భారత్ ఆసియాకప్ చరిత్రలో 9వ సారి విజేతగా నిలిచింది. ఆసియాకప్ చరిత్రలో తొలిసారి ఫైనల్‌లో పాకిస్థాన్ తలపడ్డ భారత్.. జయభేరీ మోగించింది. దీంతో ఈ టోర్నీలో మొత్తంగా మూడోసారి ఆ జట్టుకు ఓటమి రుచిచూపించింది. లీగ్ స్టేజ్‌లో ఓసారి సూపర్-4లో రెండోసారి ఫైనల్‌లో మరోసారి చిత్తు చేసింది. పాక్‌పై విజయాల హ్యాట్రిక్ నమోదు చేసింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588